ఈనాడు విశాఖపట్నం

శుక్రవారం 11 అక్టోబరు 2024

గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి



బంగారు చీర అలంకరణలో పాతనగరంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. పవర్ పయనీర్స్ సంస్థ అధినేత ఎ.రామిరెడ్డి అలంకరణకు అవసరమైన గాజులను సమకూర్చేందుకు రూ.1.25 లక్షలు అందజేశారు. అమ్మవారికి నివేదించిన గాజులను శుక్రవారం దర్శనాలకు వచ్చే భక్తులకు అందజేయనున్నట్లు ఈఓ శోభారాణి తెలిపారు. అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. –న్యూస్‌టుడే, వన్‌టౌన్

మనసున్న మారాజు..
స్మరణీయులు ప్రతీరోజు!!

- విశాఖలో 'టాటా అడుగు'జాడ!
- సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో పదిలం
- రతన్ టాటా మృతితో అంతటా దిగ్భ్రాంతి

ప్రతి ఒక్కరి రోజు వారి జీవితంలో 'టాటా' సంస్థ ఉత్పాదనలు తప్పకుండా ఉంటాయి. టీ, ఆహారం, రవాణా, ఉద్యోగం, వినోదం, వస్త్రాలు, ఆభరణాలు, ఉక్కు, గృహాలంకరణ సామగ్రి... ఇలా ఏది చూసినా ప్రతి రంగంలో టాటా అడుగు స్పష్టంగా కనిపిస్తుంది.


విలువలతో కూడిన ఆ సంస్థను దిగ్గజ స్థాయికి తీసుకు వెళ్లిన ఘనత రతన్ టాటాదే.


టాటా సన్స్ గౌరవ ఛైర్మన్‌గా ఉన్న రతన్ టాటా బుధవారం తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన అభిమానులు, ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

కేవలం వ్యాపారమే కాదు... దేశ ప్రజలకు మేలు చేసేలా సేవా కార్యక్రమాలనూ ఈ సంస్థ భారీ స్థాయిలో నిర్వహిస్తోంది. టాటా సంస్థను ఆదరిస్తున్న భారతీయులకు వివిధ రూపాల్లో సాయం చేస్తోంది. వాటిలో కొన్ని ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ అమలు చేశారు. పేదల బతుకులు బాగు చేసే కార్యక్రమాలు, ఆరోగ్యానికి కాపాడే వైద్య సంస్థలూ ఇందులో ఉన్నాయి.

విశాఖ స్వచ్ఛ నగరం. ఈ ప్రాంతంపై ఇప్పటివరకు దృష్టి సారించలేదు. ముంబయి వెళ్లాక విశాఖలో పెట్టుబడులు, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఏవిధంగా సాయపడగలమో ఆలోచిస్తాం.

- 2018 డిసెంబరు 10న ఏయూలో జరిగిన సమావేశంలో రతన్ టాటా





అక్కయ్యపాలెం 80 అడుగుల రహదారిలో విశాఖ వెల్డింగ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు రతన్ టాటాకు నివాళి అర్పిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గొప్ప మానవతావాది రతన్‌టాటా

-కూటికుప్పల సూర్యారావు

'గొప్ప మానవతావాదిగా పేరు తెచ్చుకున్న రతన్‌టాటాతో కలిసి రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల మహోత్సవంలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం. 2008లో భారత ప్రభుత్వం నుంచి చికిత్స, పరిశోధన రంగాల్లో పద్మశ్రీ పురస్కారం అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా అందుకున్నా. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన హై టీ వేడుకలో రతన్‌టాటాను కలిసి మాట్లాడడం మరచిపోలేని అనుభూతి. టాటా మెమోరియల్ ఆసుపత్రి వారి దాతృత్వానికి చిహ్నం'.

–న్యూస్‌టుడే, మురళీనగర్

'రతన్ టాటా' చొరవతోనే క్యాన్సర్ సేవలు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో రతన్ టాటా కృషితో ఏర్పాటు చేసిన హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి.. నేడు ఉత్తరాంధ్రతో పాటు, ఇతర ప్రాంత ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా ఉంది. ఆయన ఛైర్మన్‌గా ఉన్న ముంబయి టాటా స్మారక కేంద్రం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించడానికి ముందుకు రావడంతోనే విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. కేంద్ర అణుశక్తి మంత్రిత్వ శాఖ తొలుత కోల్‌కతా, త్రివేండ్రం, ఇతర నగరాల్లో ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదించినా... టాటా సంస్థ ప్రతినిధులు విశాఖ వైపే మొగ్గు చూపారు. 2009లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరా రూ.1.50 లక్షల చొప్పున 76 ఎకరాలను కేటాయించింది. ➤ 2014లో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఓవైపు పనులు జరుగుతుండగానే తాత్కాలికంగా కంటైనర్లలో వైద్య సేవలు ప్రారంభించారు. కట్టడాల నిర్మాణం పూర్తికావడంతో వైద్య విభాగాలను తరలించారు. ప్రస్తుతం పక్కా భవనాల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో చికిత్స అందిస్తున్నారు.



గిరిపుత్రులకు టాటా ట్రస్టు చేయూత

చింతపల్లి, డుంబ్రిగుడ, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో గిరిజన రైతుల జీవనోపాధి మెరుగుదలకు టాటా ట్రస్టు 'విజయవాహిని' సంస్థ ద్వారా ఎంతో చేస్తోంది. గిరిజనుల సగటు ఆదాయం రూ.1.50 లక్షలకు చేర్చాలన్న దృఢ సంకల్పంతో 43 గ్రామాల్లో టాటా ట్రస్టు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

- అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో ఎంపిక చేసిన 32 గ్రామాల్లో టాటా ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్ సంయుక్తంగా విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నాయి. మహిళలకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి పోషణ సఖీలను నియమించారు. దీని ఫలితం కూడా కనిపిస్తోంది. పోషణ సఖీలకు నిరంతరం అవగాహనకు న్యూట్రిషన్‌లో బీఎస్సీ పూర్తిచేసిన వారిని మండలానికి ఒకరిని నియమించారు.

విశాఖకు బహుమతిగా...
టీసీఎస్

దిగ్గజ సంస్థ టాటా గ్రూప్ విశాఖలో పెట్టుబడులు పెట్టనున్నట్లు బుధవారం ప్రకటించడంతో జిల్లా వాసుల్లో ఆశలు రేకెత్తాయి. అయితే... అప్పటికే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా కన్నుమూశారనే వార్త మరి కొద్ది సమయంలోనే తెలిసి అంతటా దిగ్భ్రాంతి నెలకొంది. ఆయన చివరి దశలో ఉన్నప్పుడే టీసీఎస్ రూపంలో విశాఖకు బహుమతి ఇచ్చారని పలువురు పేర్కొంటున్నారు. – ఈనాడు, విశాఖపట్నం



2018లో ఏయూలో జరిగిన కార్యక్రమంలో రతన్ టాటాకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

టీసీఎస్ ప్రతిపాదన అప్పుడే..

రతన్ టాటా విశాఖ వచ్చిన సమయంలో నగరంలో టీసీఎస్ ఏర్పాటు ప్రతిపాదన వచ్చిందని పలువురు చెబుతున్నారు. ఆయన రాకకు గుర్తుగా ఇక్కడ టీసీఎస్ నెలకొల్పాలని అప్పటి ప్రజాప్రతినిధులు టాటా దృష్టికి తీసుకెళ్లారు.


➤ యాదృచ్ఛికంగా ఆయన అస్తమయానికి కొన్ని గంటల ముందు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు టాటా సంస్థ సుముఖత వ్యక్తం చేసిందని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు.

ఆ కొన్ని నిమిషాల్లోనే..



2018లో తాజ్‌హోటల్‌లో ఏయూ ఆచార్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో రతన్‌టాటా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : 2018 డిసెంబరు 10 ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి రతన్ టాటా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆ కార్యక్రమంలో ఆయన కొన్ని నిమిషాలే ప్రసంగించినా విశాఖ అభివృద్ధి గురించే ఎక్కువగా మాట్లాడారని ఆ సంఘం ప్రతినిధి డాక్టర్ కుమార్‌రాజ్ గుర్తుచేసుకున్నారు. విశాఖలో మా సంస్థ ముద్ర తప్పని సరిగా ఉంటుందని.. టీసీఎస్ ఏర్పాటు చేస్తామని ఆయన అప్పుడే చెప్పారని తెలిపారు. ➤ రతన్‌టాటా మృతిచెందారన్న వార్త తెలుసుకుని ఆయన ఏయూను సందర్శించినప్పటి విషయాలను ఆచార్యులు గుర్తుచేసుకున్నారు. రతన్‌టాటా విశాఖలో ఉన్న నాలుగైదు గంటల వ్యవధిలోనే ఏయూ మొత్తం చూశారన్నారు. తాజ్‌హోటల్‌లో ఆచార్యులతో సమావేశమై విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశం చేశారని రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు చెప్పారు. టాటా సన్స్ ప్రస్తుత ఛైర్మన్ చంద్రశేఖరన్ గత ఏడాది ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశానికి వచ్చినప్పుడు విశాఖలో టీసీఎస్ ఏర్పాటుకుగల అవకాశాలు వివరించారు. దానిపైనే తాజాగా గురువారం ప్రకటన వెలువడింది.



నీలాల సాగరం... అలలతో సుందరం

దసరా సెలవులకు పెద్ద సంఖ్యలో విశాఖ వస్తున్న పర్యాటకులు కైలాసగిరి నుంచి నగర అందాలను తిలకించి మైమరచిపోతున్నారు. ఎటు చూసినా పచ్చదనంతో కట్టిపడేసే కైలాసగిరి పైనుంచి కను చూపు మేర నీలి సంద్రం సొబగులను తిలకించేందుకు రెండు కళ్లూ చాలవంటూ పరవశించిపోతున్నారు. కొండలపైనుంచి సాగరాన్ని ఇలా దగ్గరగా చూసే అవకాశం రాష్ట్రంలో అతి కొద్ది ప్రాంతాల్లోనే ఉంది.

– ఈనాడు, విశాఖపట్నం

అటవీ భూముల రక్షణకు ప్రాధాన్యం

విశాఖ సర్కిల్ ముఖ్య సంరక్షణాధికారి మహమ్మద్ దివాన్ మైదీన్



ఈనాడు, విశాఖపట్నం: అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించడం, ప్రజలను ప్రకృతికి చేరువ చేసే నగర వనాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆ శాఖ విశాఖ సర్కిల్ ముఖ్య సంరక్షణాధికారి మహమ్మద్ దివాన్ మైదీన్ తెలిపారు. సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్)గా ఆయన నూతనంగా బాధ్యతలు తీసుకున్నారు. గురువారం తనని కలిసిన విలేకర్లతో మాట్లాడారు. విశాఖలో అటవీశాఖకు విలువైన భూములున్నాయని గతంలో ఆక్రమణలకు గురైనవి, కోర్టు కేసుల్లో ఉన్నవాటిపైన సంబంధిత అధికారులతో సమీక్షించి కాపాడుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు నగర వనాలను అభివృద్ధి చేస్తున్నామని, అందులో కంబాల కొండ సమీపంలో ఒకటి, అనకాపల్లి జిల్లా బయ్యవరంలో మరొక పార్కును నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఉదయపు నడక, వ్యాయామం, పిల్లలు ఆడుకునేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరో తొమ్మిది ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడుతున్నామని అందులో కొన్ని ప్రగతిలో ఉన్నాయి. మిగిలినవి త్వరలోనే కార్యరూపంలో తేవడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

కుంకి ఏనుగుల శిక్షణకు ముగ్గురు: 'పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల సరిహద్దుల్లో ఏనుగుల సంచారంతో జరుగుతున్న నష్టం నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి కుంకి ఏనుగులను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేశారు. ఆ ఏనుగుల నిర్వహణకు సంబంధించి పార్వతీపురం మన్యం నుంచి ఇద్దరు ట్రాకర్లు, జూపార్క్ నుంచి ఒకరిని కర్ణాటకకు శిక్షణ నిమిత్తం పంపిస్తున్నాం. రెండు నెలలు పాటు వారు అక్కడ శిక్షణ తీసుకుని వస్తారు' అని సీసీఎఫ్ అన్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అడవుల సంరక్షణ చర్యలు చేపట్టడానికి కృషి చేస్తామని చెప్పారు

తినేందుకు అనుకూలం..
పోషకాలు పుష్కలం

6వ పేజీలో

ఎఫ్ఎస్ఎన్ఎల్ కార్మికులకు రూ.21వేల బోనస్

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని ఫెర్రోస్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) కార్మికులకు ఈ ఏడాది రూ.21 వేల బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఫెర్రోస్క్రాప్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రాజశేఖర్ తెలిపారు. బిలాయ్ కర్మాగారంలోని సంస్థ కార్యాలయంలో పర్సనల్ అధికారులతో, వివిధ ప్రాంతాల్లోని కార్మిక నాయకుల మధ్య గురువారం వర్చువల్‌గా జరిగిన చర్చల్లో బోనస్ చెల్లింపుపై ఒప్పందం కుదిరిందన్నారు. చర్చల్లో విశాఖ నుంచి పి.రాములు, ఎం.అమ్మిరెడ్డి, అధికారులు సంజయ్‌కుమార్, పంకజ్ త్యాగి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై
రవాణా శాఖ కొరడా

మాధవధార, న్యూస్‌టుడే: దసరా వేళ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. గురువారం నిర్వహించిన తనిఖీల్లో 8 బస్సులను సీజ్ చేసి, 10 బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా రవాణా శాఖ డీటీసీ జి.ఆదినారాయణ తెలియజేశారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, ఎక్కడికక్కడ స్టేజ్ క్యారియర్స్ నిర్వహించడం, పర్మిట్, ఎఫ్‌సీలు లేకుండా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి, సీజ్ చేసినట్లుగా ఆయన తెలియజేశారు. నిబంధనలు పాటించి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను నడపాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. పండగ సందర్భంగా ఈ నెల 16 వరకు ప్రత్యేక బృందాల ద్వారా ప్రతి రోజు తనిఖీలు నిర్వహించనున్నట్లుగా తెలియజేశారు.

'కీలక నాయకత్వం'పై నేవీ దృష్టి

సింధియా, న్యూస్‌టుడే : విశాఖ తీరంలో జరుగుతున్న 'మలబార్-2024' విన్యాసాల్లో భాగంగా 'కీలక నాయకత్వం' అనే అంశంపై గురువారం భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాల అధికారుల మధ్య చర్చ సాగిందని నేవీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఇండో- పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛా వాణిజ్యం, భద్రత అంశాలపై దృష్టి సారించినట్టు నౌకాదళం అధికారులు ప్రకటించారు. హార్బర్, సీ-ఫేజ్‌ల్లో జరిగే విన్యాసాలతో ఆయా దేశాల మధ్య బంధం బలోపేతం అవుతుందని నేవీ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సమావేశంలో ఈస్ట్రన్ నేవల్ కమాండ్ వైస్‌అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, అమెరికా పసిఫిక్ ఫ్లీట్ కమాండర్, అడ్మిరల్ స్టీఫెన్ ఖేలర్, జపాన్ స్వీయ రక్షణదళం ఫ్లీట్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్‌అడ్మిరల్ కట్సుషీ ఒమాచి, ఆస్ట్రేలియా ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ క్రిస్టోఫర్ స్మిత్ పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న నౌకాదళాల అధికారులు

విదేశీయుల సందర్శన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: చెన్నైలోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ కార్యాలయం, రాయల్ ఆస్ట్రేలియన్ నేవీకి చెందిన అధికార ప్రతినిధుల బృంద సభ్యులు గీతం డీమ్డ్ వర్సిటీని గురువారం సందర్శించారు. ఈ మేరకు ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సుల్ జనరల్ డేవిడ్ ఎగ్లెస్టన్, నేవీ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ క్రిస్టోఫర్ స్మిత్‌ల బృంద సభ్యులతో గీతం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు పలు విభాగాల అధికారులు సమావేశమయ్యారు. గీతం నిర్వహిస్తున్న పలు కోర్సులు, పరిశోధన ప్రాజెక్టులు, అంతర్జాతీయ సంబంధాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో డేవిడ్ ఎగ్లెస్టన్ మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీ, ఆగ్రో బిజినెస్, విద్య, పర్యాటకం, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాల్లో పరస్పర సహకారానికి కృషి చేస్తున్నామన్నారు. విశాఖ పోర్టుకు దిగుమతి అయ్యే వాటిలో ఆస్ట్రేలియా బొగ్గు కీలకమైందన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై క్రిస్టోఫర్ స్మిత్ కీలక ప్రసంగం చేశారు. పలువురు విద్యార్థుల ప్రశ్నలకు ప్రతినిధులు సమాధానాలిచ్చారు.



గీతం ఆచార్యులతో ఆస్ట్రేలియా ప్రతినిధుల బృంద సభ్యులు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బాలికల సంరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. గురువారం సూర్యాబాగ్‌లో ఉన్న బిల్ జంక్షన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని.. నగరంలో ఉన్న స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వివక్షకు తావులేకుండా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు 'సేవ్ గర్ల్ చైల్డ్' అంశంపై వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ఎం.జ్యోషిక, ఎం.హాసిని, ఎల్.వర్షిణి.. పెయింటింగ్‌లో వై.నీతూఅక్షయ, సామ్ అబ్రహం, పి.చాందిని.. వక్తృత్వ పోటీల్లో ఆర్.ప్రవల్లిక, పి.అచ్యుతరావు, బి.ఆదిత్యలు ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రశంసాపత్రాలతో పాటు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీఈఓ చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఉషాప్రసాద్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవనరాణి, ఇతర అధికారులు బి.నాగేశ్వరరావు, బి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

వంటనూనెల అమ్మకాలకు శ్రీకారం



కొనుగోలుదారులకు నూనె ప్యాకెట్లు అందిస్తున్న జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ధరల నియంత్రణలో భాగంగా జిల్లా పరిధిలో ఉన్న 13 రైతుబజార్లలో తక్కువ ధరలకు వంటనూనెలు, టమోటాల విక్రయాలకు జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. సన్‌ఫ్లవర్ నూనెలకు సంబంధించి గోల్డ్‌డ్రాప్ లీటరు రూ.128, క్రిస్టల్ రూ.130, ఫ్రీడమ్ రూ.132ల చొప్పున విక్రయిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. గురువారం 153 ప్యాకెట్లు విక్రయించారు. టమోటాలు కిలో రూ.50 చొప్పున ఇంత వరకు 50 టన్నుల మేర విక్రయించినట్లు వివరించారు. ఆయన నగరంలోని సీతమ్మధార రైతుబజార్‌లో వంట నూనెల అమ్మకాలను డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావుతో కలిసి గురువారం పరిశీలించారు. అమ్మకాలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే కలెక్టరేట్‌లో నియంత్రణ గది ఫోన్ నెంబర్లు 0891-2590100, 0891-2590102 లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

అప్పన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి

సింహాచలం, న్యూస్‌టుడే: కర్ణాటక ముఖ్యమంత్రి కార్యదర్శి కె.వి.త్రిలోక్ చంద్ర సతీ సమేతంగా గురువారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



కప్పస్తంభం వద్ద త్రిలోక్ చంద్ర దంపతులు

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత విశాఖ

నంద్యాల: నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా వైజాగ్ జట్టు నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్లో పశ్చిమగోదావరిపై విశాఖ మూడు పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది.


గెలుపొందిన విశాఖ జట్టు

పెందుర్తి

వైభవంగా నేస్తాలమ్మ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ ప్రజల ఆరాధ్య దేవత నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి అనుపోత్సవం చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: పాతసబ్బవరంలో కాలువ లేకపోవడంతో మురుగంతా వాటర్ ట్యాంకు సమీపంలో నిలిచిపోతోంది. దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. స్థానికులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు.
– జి.అప్పలనాయుడు, పాతసబ్బవరం

సమాధానం: పంచాయతీ కార్యవర్గ సమావేశంలో చర్చించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
– డి.ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

పండగ వేళ.. ధరల దడ

★ భారీగా పెరిగిన కూరగాయల రేట్లు
★ ఉక్కిరిబిక్కిరవుతున్న వినియోగదారులు



పెందుర్తి, న్యూస్‌టుడే: అంకెర ఆదాయం.. అపరిమిత వ్యయంతో అవస్థలు పడుతున్న సగటు జీవికి కూరగాయల ధరలు కొరకరాని కొయ్యలా మారాయి. రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న ధరలను చూసి సామాన్యులు భయపడాల్సిన పరిస్థితి. రైతుబజార్లలోనే రేట్లు కొండెక్కి కూర్చుంటే.. బయట మార్కెట్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏ కూరగాయ ధరలు చూసినా కిలోకు కనీసం రూ.50 ఖర్చు చేయాల్సిన దుస్థితి. బయట విపణిలో వీటి రెట్టింపు ఉంటున్నాయి. దీంతో రైతుబజార్లకు కొనుగోలుదారులు బారులు తీరుతున్నారు.

కాలానుగుణ పంటలు పెరగాలి..

జిల్లాలో కాలానుగుణంగా పండించే కూరగాయల పంటలు పెరిగితే ధరలు కొంతమేర తగ్గే అవకాశం ఉందని మార్కెటింగ్ నిపుణులు చెబుతున్నారు. వరి పంట పండించే సమయం కావడంతో కూరగాయల సాగు తగ్గి డిమాండ్ పెరిగిందని పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో కాయగూరల సాగును ప్రభుత్వం మరింత ప్రోత్సహించి సరఫరాను పెంచకపోతే పరిస్థితి దారుణంగా మారుతుందని పేర్కొంటున్నారు.

మరి కొన్నాళ్లు ఇదే పరిస్థితి..

మరికొన్నాళ్లు కూరగాయల ధరలు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. స్థానికంగా పంటలు ఉత్పత్తి పోవడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కూరగాయలు ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయని చెబుతున్నారు. దీంతో కొరతగా కూరగాయలు దొరకని పరిస్థితి. వచ్చే కార్తీక మాసంలో అధిక జనాభా మాంసాహారం తీసుకోని నేపథ్యంలో కూరగాయల వినియోగం మరింత పెరుగుతుంది. ధరలు ఇలాగే కొనసాగితే సగటు జీవికి ఆర్థిక భారం మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

పెందుర్తి రైతుబజారులో ధరలు ఇలా...

కూరగాయలు	గత నెల 10న ధరలు కిలో రూపాయల్లో..	గురువారం ధరలు కిలో
టమాటా	30	50
గుత్తి వంకాయ	50	58
బీరకాయలు	42	52
దొండకాయలు	40	44
క్యారెట్	30	40
బంగాళదుంపలు	29	30
బరబాటి	42	50
దేముడు చిక్కుడు	64	74
కాకరకాయలు	30	44
ఆగాకర	98	100
మునగకాడలు	40	82

రైతుబజార్‌లో వంట నూనెల విక్రయాలు


రాయితీ టమాటాకు బారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: బహిరంగ విపణిలో వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రైతుబజార్లలో నిర్ణీత ధరలకు వంట నూనెల విక్రయాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గురువారం సాయంత్రం నుంచి పెందుర్తి రైతుబజార్‌లో వంటనూనెల విక్రయాలు ప్రారంభించినట్లు ఎస్టేట్ అధికారి షర్మిల తెలిపారు. పామాయిల్ లీటర్ రూ. 120, సన్‌ఫ్లవర్ ఆయిల్ కంపెనీల బట్టి రూ. 128 నుంచి రూ. 132 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రాయితీపై టమాటాల విక్రయాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కిలో రూ. 50కు ప్రతి వినియోగదారుడికి రెండు కిలోలు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.


వినియోగదారులకు నూనె ప్యాకెట్లు అందిస్తున్న రైతుబజార్ ఈవో షర్మిల

కూడళ్లలో గుంతలు.. రాకపోకలకు అవస్థలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్, సబ్‌స్టేషన్ కూడళ్లలో రహదారి ధ్వంసమై భారీ గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లంకెలపాలెం, గాజువాక, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో ఈ రోడు నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోందని చెబుతున్నారు. రోడ్డు అంచులు దెబ్బతినడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ద్విచక్రవాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలను పూడ్చాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పరవాడ సబ్‌స్టేషన్ కూడలి సమీపంలో భారీ గుంతలు

అ వీ ఇ వీ

బీఆర్టీఎస్‌లో అప్రమత్తంగా ప్రయాణించండి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ సేవా రహదారిలోని ప్రమాదకర ప్రదేశాల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు అప్రమత్తంగా ఉంటూ రాకపోకలు సాగించాలని 93వ వార్డు కార్పొరేటరు రాపర్తి కన్నా, ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింగరాజు పేర్కొన్నారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి పాతగోశాల కూడలి వరకు 8 చోట్ల ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. ఆయా పనులను గురువారం కార్పొరేటరు, ట్రాఫిక్ ఎస్‌ఐ పర్యవేక్షించారు.

'మందకృష్ణ మాదిగ అరెస్టు సరికాదు'

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎస్సీల రిజర్వేషన్ కోసం పాటుపడుతున్న మందకృష్ణ మాదిగను తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేయడం సరికాదని అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు గొట్టివాడ సామ్రాట్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను చేపట్టకుండా సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా తెలంగాణాలో డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేశారని ఆరోపించారు. దీనిపై హైదరాబాద్‌లో శాంతియుత నిరసన ర్యాలీ చేస్తున్న మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎస్సీల వర్గీకరణ పూర్తయ్యాకే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఐ.గోపి, సబ్బవరం మండల కన్వీనర్ నీటిపల్లి గౌరీ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారేడుబూడి కోటి, జిల్లా ఉద్యోగుల సమాఖ్య సలహాదారు దువ్వు దుర్గాలు, జి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు చేగువేరా

పరవాడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాడి విప్లవ వీరుడిగా చేగువేరా నిలిచిపోయారని అనకాపల్లి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. పరవాడలోని సంస్థ కార్యాలయంలో గురువారం చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చేగువేరాను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.వి.శ్రీనివాసరావు, టి. మల్లేశ్వరరావు, దేవకిశోర్, రాంబాబు, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ఎలక్ట్రికల్ సంస్థలో ఈ నెల 4న జరిగిన చోరీలో పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు నేర విభాగం ఏసీపీ వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుర్రమ్మపాలెంలోని జీఈ ఎలక్ట్రికల్స్ సంస్థలో సుమారు రూ.12 లక్షలు విలువ చేసే 880 కిలోల రాగి తీగలను ఈ నెల 4న అర్ధరాత్రి దుండగులు దోపిడీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు పెందుర్తి నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా చినముషిడివాడ దరి ఏకలవ్య కాలనీ, గాజువాక ప్రాంతాలకు చెందిన చిత్తు కాగితాలు ఏరుకునే పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో పతకాలు


పతకాలు గెలుపొందిన క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) తైక్వాండో పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు పతకాలు గెలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దేముడుబాబు తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగాల్లో వెంకట ధనుష్, వై.జ్యోత్స్న, బి.క్రిష్ణచైతన్య, మోహిత్, పి.జస్విక, అంజనిప్రియ, సుస్మిత, టి.మణికంఠ హిమాన్షు స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా బి.అమృతవర్షిణి, బి.లావణ్య, కె.ఉదయ్‌నిఖిల్, కె.ఆదిత్య, టి.శ్రీకర రోహిత్‌కుమార్, కె.ధనలక్ష్మి రజత పతకాలు, వి.యువరాజ్, ఎస్.గోవర్ధని, లావణ్య షా థిమామున్నీస్, ఎం.గాయత్రి కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు.

దుష్ట సంహారిణి.. దుర్గా స్వరూపిణి


సుజాతనగర్‌లో..


ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


సప్తగిరినగర్‌లో ధనలక్ష్మి అవతారం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా దంపతులు


కృష్ణానగర్‌లో..

దుష్టులను శిక్షించి.. శిష్టులను రక్షించే దుర్గా స్వరూపిణిగా జగన్మాత భక్తుల నీరాజనాలందుకున్నారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేసి ప్రత్యేక నివేదనలు సమర్పించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. పలుచోట్ల భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


చింతలగ్రహారం కృష్ణాలయంలో..


సబ్బవరం దుర్గమాంబ సన్నిధిలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సీఐ పిన్నింటి రమణ


ముత్యాలమ్మపాలెంలో..


బంగారమ్మపాలెంలో ఘటాల ఊరేగింపు


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు


దుర్గానగర్‌లో..


నాయుడుతోటలో..


వెన్నెలపాలెంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సతీమణి మాధవీలత


పెదతాడిలో..


మణిపురంలో..


దేవీపురంలో..


ఆరిపాకలో..


సుజాతనగర్ లక్ష్మీనరసయ్యమ్మ ఆటోస్టాండు ఆధ్వర్యంలో అన్నసమారాధన

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడి సన్నిధిలో గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవడానికి అందరూ సహకరించాలని పరవాడ ఎంపీడీవో శ్యామ్ సుందర్ పిలుపునిచ్చారు. మండలంలోని గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం సచివాలయ, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు ఉద్యోగులు చీపుళ్లు చేతపట్టి కాలనీలోని రోడ్లను పరిసరాలను శుభ్రం చేశారు. ఈవోపీఆర్డీ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


రహదారులను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు తదితరులు

ఉక్కులో బతుకమ్మ సంబరాలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-5), న్యూస్‌టుడే : ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సీ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయి. కార్యక్రమాన్ని ఉక్కు సీజీఎం (వర్క్స్) ఇన్‌ఛార్జి యు.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జీఎంలు రవిశేఖర్, నవీన్‌కుమార్, ఎన్.వీరేశం, ఎన్.కుమారస్వామి, మోహన్‌రావు, జి. ఆనంద్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, తదితరులు


ఫుట్‌బాల్ ఆడుతున్న వివిధ దేశాల నేవీ సిబ్బంది

నేవీ స్నేహపూర్వక క్రీడలు

సింధియా, న్యూస్‌టుడే : విశాఖ తీరంలో జరుగుతున్న మలబార్-2024 విన్యాసాల్లో భాగంగా గురువారం భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాల సిబ్బంది మధ్య స్నేహపూర్వక క్రీడలు జరిగాయని నేవీ వర్గాలు తెలిపాయి. సాంస్కృతిక అంశాల్లో పరస్పర సంబంధాల మెరుగునకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నాయి.

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సేవలు భేష్

సీతంపేట, న్యూస్‌టుడే : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రజలకు మంచి సేవలు అందిస్తోందని డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలకు నేత్ర సంబంధిత వ్యాధుల నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఛైర్మన్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ నవీన్ కుమార్, నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు

పల్లె పండగ వారోత్సవాలకు సన్నాహాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 తేదీ నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రారంభం కానున్న పల్లె పండగ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. 14 నుంచి మండలంలోని 15 పంచాయతీల పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు సంబంధించి ఎమ్మెల్యే చేతులు మీదుగా భూమిపూజ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ రమణమూర్తి, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, ఉపాధి హామీ ఏపీవో గోవింద్, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం, స్నేహపురి కాలనీలో జీవీఎంసీ నిధులు రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కాలువల పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, తదితరులు

రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో..?


అభివృద్ధికి నోచుకోని గవరవానిపాలెం రహదారి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారి నుంచి గవరవానిపాలెం మీదుగా ఎస్‌వీఎల్ లేఅవుట్‌లోని ఎన్టీఆర్ కాలనీ వరకు సుమారు 2 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి 6 ఏళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రూ.కోటి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ప్రతిపాదన మరుగున పడింది. దీంతో పనులు ప్రారంభం కాలేదు. మట్టి రోడ్డు కావడంతో చినుకు పడితే బురదమయమై అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకుని రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి : సిటూ

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : కర్మాగారంలోని పలు విభాగాల్లో రెండు నెలలుగా ఎలాంటి టెండర్లు పిలవకపోవడంతో సుమారు 600 ఒప్పంద కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని సిటూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉక్కునగరం స్మృత్యంజలి పార్కు వద్ద ఒప్పంద కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకే టెండర్లు పిలవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి... సమస్యను పరిష్కరించాలని కోరారు.



ధర్నా చేస్తున్న సిటూ సభ్యులు



ఉద్యానవనంలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పరిసరాలు

ఆహ్లాదకర నందనం.. ఆధ్యాత్మిక పరిమళం



పిరమిడ్ కేంద్రం

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ సెక్టార్-4లో సుమారు 2,800 చదరపు గజాల్లో విస్తరించి ఉన్న సుదర్శన్ పార్కు ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మికత పంచే క్రమంలో ముందు వరుసలో నిలుస్తోంది. మురళీనగర్‌లో 10 పార్కు లకు పైగా ఉన్నప్పటికీ ప్రతి పార్కుకు ఓ ప్రత్యేకత ఉంది. మున్సిపల్ కమిషనర్‌గా నగరంలో పనిచేసిన విద్యాసాగర్ ఈ ఉద్యానవనానికి కొంతమేర చేయూతనందించారు. అందులో భాగంగా ఫుట్‌పాత్, సంపు, మోటారు, నడక రహదారి, విద్యుదీకరణ ఏర్పాటు చేయగా కమిషనర్ సంజయ్ జాజూ హయాంలో 2005లో ధ్యానమందిరాన్ని నిర్మించారు. ఇందుకోసం జీవీఎంసీ సుమారు 5 లక్షల రూపాయలు మంజూరు చేయగా ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న వార్డ్ వేములపల్లి పూర్ణ చంద్రరావు రూ.2లక్షలు విరాళంగా అందజేశారు.

★ జీవీఎంసీ ఈ పార్కును జీవీఎంసీ నిధులు సుమారు రూ.20 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. పాత్‌వే విస్తరణ, ఆధునికీకరణ, ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆట పరికరాలు, ప్రహరీకు ఆకర్షణీయమైన రంగులు వేశారు. చిన్నారులు ఆడు కునేందుకు ఆట పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. పార్కు కమిటీ సభ్యుల విరాళంతో శాశ్వత పను లను పూర్తి చేశారు.



సేద తీరుతున్న వృద్ధులు

★ ఔషధ మొక్కలకు ప్రాధాన్యం: క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే లక్ష్మీతరువు, అంజీరా, వేప, మారేడు, నేరేడు, రావి, మామిడి, లక్ష్మణ ఫలం, పారిజాతవృక్షాలు, తులసి, బాదం వంటి మొక్కలు ఎన్నో ఈ పార్కులో ఉన్నాయి.

★ ఆధ్యాత్మిక, ఆరోగ్య కార్యక్రమాలు: ప్రతిరోజు ఉదయం యోగా, మెడిటేషన్ వంటివి ఉచితంగా బోధిస్తారు. పౌర్ణమి వంటి ప్రత్యేక రోజుల్లో గురువుల ద్వారా పిరమిడ్ ధ్యానం చేయిస్తారు.

★ సందర్శన వేళలు: ఉదయం 5-30 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9వరకు. కాలనీవాసుల సౌకర్యార్థం పలు సామాజిక సంస్థలు పార్కులో ఉచిత వైద్య శిబిరాలు నిర్వ హించేందుకు అనుమతి ఇస్తున్నారు.



నిర్మించిన ధ్యాన కేంద్రం

★ ఎ.వీరబాబు (అధ్యక్షులు): పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. మా కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొని పార్కును ఆకర్షణీయంగా ఉంచేందుకు సహ కారం అందిస్తు న్నారు.



★ ఎం.ఆర్.కె.రంగారావు (కార్యదర్శి): నివాసి తులు, సుదర్శన్ పార్కు సంఘ సభ్యులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు, ఉద్యానవన అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నారు. నిత్యం సందర్శకులతో పార్కు కళకళ లాడుతూ ఉంటుంది. దోమల నిర్మూల నకు ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు సౌకర్యవంతంగా సేద తీరేందుకు వీలుగా పార్కు అంతటా ఆధునిక బెంచీలను ఏర్పాటు చేశాం.



రూ.4కోట్లతో కన్యకా పరమేశ్వరికి అలంకరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాతనగరంలోని కన్యక పరమేశ్వరి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిగా అలంకరించారు. 147 ఏళ్ల పురాతన ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా 6 కేజీల బంగారు ఆభరణాలు, బిస్కెట్లు, 10 కేజీల వెండి, రూ.4 కోట్ల నోట్లతో అమ్మవారిని, ఆలయాన్ని నిర్వాహకులు అలంకరించినట్లు దేవస్థానం సంఘం అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు తెలిపారు. గురువారం 108 రకాల ద్రవ్యాలు, పంచ రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీర, కిరీటంతో, రూ.1 నుంచి రూ.500 నోట్లు వినియోగించి ఆలయాన్ని సైతం అలంకరించారు. దేవస్థానం మండపంలో మహిళలతో కుంకుమపూజ నిర్వహించారు.



ఆలయంలో అలంకరణ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

నర్సింగ్ కళాశాలలో వసతుల కల్పనకు ఐఓసీఎల్ ముందడుగు


వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్ ఆవరణలో ఉన్న నర్సింగ్ స్కూల్ భవనంలో మౌలిక వసతుల కల్పనకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ముందుకొచ్చింది. వసతి గృహంలో 165 మంది విద్యార్థినులు ఉంటూ నర్సింగ్ కోర్సును అభ్యసిస్తున్నారు. ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ వి.శివానందను కలిసిన అనంతరం వసతి గృహాన్ని సందర్శించి అక్కడ ఏ పనులు చేపట్టాలనే విషయమై చర్చించారు. తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా బోర్‌వెల్ ఏర్పాటు, వాష్‌రూమ్స్, మరుగుదొడ్లు పునరుద్ధరణ, తరగతి గది నిర్మాణం, డిజిటల్ బోర్డులు ఏర్పాటు, 150 మంచాలు, పరుపుల కొనుగోలు తదితరాల కోసం నిధులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు రూ.70 లక్షల వరకు ఇచ్చేందుకు ఐఓసీఎల్ అధికారులు సుముఖత తెలిపారని, ఈ మేరకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నామని డాక్టర్ శివానంద తెలిపారు.



నర్సుల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ వి.శివానంద, ఐఓసీఎల్ ప్రతినిధులు

తినేందుకు అనుకూలం.. పోషకాలు పుష్కలం

గుడ్డు వినియోగం పెరగాలంటున్న నిపుణులు



సమతుల ఆహారంగా భావించే కోడిగుడ్డును క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. తద్వారా వ్యాధినిరోధక శక్తి పెరిగి క్యాన్సర్ రాకుండా కీలక పాత్ర పోషిస్తుంది. క్రీడాకారులు సైతం తప్పకుండా తీసుకుంటారు. కండరాల పటుత్వం పెరిగి క్రీడల్లో రాణించేందుకు ఉపకరిస్తుంది. పోషకాల గనిగా గుడ్డుకు ప్రత్యేక స్థానముంది. అక్టోబరు రెండో శుక్రవారం (ఈ నెల 11) ప్రపంచ గుడ్డు దినోత్సవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా గుడ్ల వినియోగం, దాని వల్ల చేకూరే ప్రయోజనాలపై కథనం. – న్యూస్‌టుడే, వన్‌టౌన్

★ రోజుకు ఒకటి, రెండు తప్పనిసరి: కోడి గుడ్లలో ప్రోటీన్లు, పిండిపదార్థాలు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా తెల్లసొనలో ఇవి అధికం. కోలిన్, అమైనో ఆమ్లాలు ఉండటంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పచ్చ సొనలో కొలెస్ట్రాల్ (మంచిది) ఉంటుంది. కాబట్టి రోజుకు ఒకటి లేదా రెండు గుడ్లు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.


★ బరువు సమతుల్యంగా ఉండేందుకు..: వ్యాధి నిరోధక శక్తి పెరిగి శరీర బరువును సమతూకంగా ఉంచుతుంది. క్యాన్సర్లు, ఇన్‌ఫెక్షన్లు, ఇతర జబ్బుల దరి చేరకుండా చేస్తుంది. కోడిగుడ్డు తినడం వల్ల ఆకలిని తగ్గించడంతో అధిక ఆహారం తీసుకోరు. ఇలా పరోక్షంగా శరీర బరువును అదుపులో ఉంచుతుంది.

★ పిల్లలకు బలవర్థక ఆహారం..: గుడ్డులో ప్రోటీన్లు మెండుగా ఉంటాయి కాబట్టి పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలి. మూడో ఏట నుంచి తినిపించవచ్చు. బలవర్ధకమైన ఆహారం కావడంతో ఎదుగుదలకు ఉపకరిస్తుంది.

★ ఉడకబెట్టిందే తీసుకోవాలి: ఉడకబెట్టిన గుడ్డును మాత్రమే తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, రక్తహీనత వంటివి దరి చేరకుండా చేస్తుంది. క్రీడాకారులు వీటిని తప్పక తీసుకోవాలి. పగులగొట్టి తీసుకుంటే ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. గుండె జబ్బులున్న వారు పచ్చ సొన తీసుకోకూడదు. తెల్ల సొనతో ఇబ్బందేమీలేదు. గర్భిణులు తీసుకోవచ్చు. – డాక్టర్ డి.రాధాకృష్ణ, మెడిసిన్ విభాగాధిపతి, కేజీహెచ్



★ రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి..: ప్రపంచ తలసరి కోడిగుడ్ల వినియోగం 340 వరకు ఉండగా.. రాష్ట్రం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 92 వరకు మాత్రమే ఉంది. విదేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. దీన్ని మరింత పెంచాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌల్ట్రీ రైతులకు రూ.కోట్లలో ఉన్న బకాయిలు విడుదల చేసి ప్రభుత్వం ఆదుకోవాలి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కోడిగుడ్లు ఎగుమతి అవుతున్నాయి. రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడంతో పాటు వినియోగం పెంపునకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. – భరణికాన రామారావు, నెక్ కేంద్ర కమిటీ సభ్యులు



యువకులను మోసగించిన నిందితురాలిపై విచారణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడిన యువతి వెనుక ఉన్న ముఠాకు సంబంధించి కూపీ లాగేందుకు భీమిలి పోలీసులు ఆమెను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఓ విశాఖ యువకుడిని వలలో వేసుకుని బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని తర్వాత పెళ్లి చేసుకోవాలని వేధించిన కేసులో ఈనెల 5వ తేదీన కొరుప్రోలు జోయ్ జమీనా అనే యువతిని భీమిలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి విదితమే. అయితే గతంలో ఇదే తరహాలో మరి కొందరు యువకులను ఈమె మోసగించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో వివరాలు రాబట్టేందుకు కోర్టు అనుమతితో కారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఈమెను పోలీసులు గురువారం భీమిలి స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. ఈ విషయమై విశాఖ ఉత్తర మండల ఏసీపీ జి.అప్పలరాజు విలేకరులతో మాట్లాడుతూ తమ విచారణలో నిందితురాలి నుంచి కొన్ని వివరాలు సేకరించామని, ఈమెపై కంచరపాలెం, పీఎం పాలెం స్టేషన్లలోనూ కేసులు ఉన్నాయన్నారు. ఆయా నేరాలకు ఈమెకు కొందరు సహకరించినట్లు ఆధారాలు లభించాయన్నారు. త్వరలో వారిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెల్లడించారు



భీమిలి స్టేషన్‌కు జోయ్ జమీనాను ముసుగుతో తీసుకొచ్చిన పోలీసులు

స్వీపరు కుమారుడికి కొలువు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కొలువులు సాధించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో బుధవారం పది మంది విద్యార్థులు ఎంపికవ్వగా గురువారం జి.బాలాజీ ఎంపికయ్యాడు. కళాశాలలో స్వీపరుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి కుమారుడు అతడు. ఈ సందర్భంగా అతడిని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అభినందించారు. బాలాజీ పాలిసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి ఆయిల్ టెక్నాలజీ బ్రాంచ్‌ను ఎంచుకుని ప్రతిభ కనబరచాడని కొనియాడారు.



బాలాజీకి నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, విభాగాధిపతులు

ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి: కోరమండల్ కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. తండ్రి కృష్ణారావు రైతు. తల్లి కుమారి గృహిణి. నాది అనకాపల్లి. టెక్నికల్ స్కిల్స్ పెంచుకుని కళాశాలకు మంచి పేరు తెస్తాను. కుటుంబపరంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. నాకు ఉద్యోగం రావడంతో వాటి నుంచి గట్టెక్కడానికి అవకాశం లభించింది.
– ఎ.మౌనిక ప్రియ, పెట్రోకెమికల్ బ్రాంచ్, అనకాపల్లి



ఎంతో సంతోషంగా ఉంది: వేరే ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేసేకన్నా విశాఖలోనే ఉద్యోగం రావడం సంతోషం. అమ్మాయిలకు కోరమండల్ కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఉద్యోగ జీవితంలో తల్లిదండ్రులకు తోడు నీడగా నిలుస్తాను. కళాశాలలో చదువుతోపాటు ఇతర మోటివేషనల్ స్కిల్స్ వంటివి చెప్పడంతో ఉద్యోగం రావడానికి ప్రధాన కారణం.
–జె.శ్రావణిశృతి, పెట్రోకెమికల్, ఓల్డ్ డైరీఫారం



ఎంపీ భరత్ దృష్టికి సమస్యలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్టీల్‌ప్లాంటు రక్షణ, ఎస్ బీసీ వంతెన, పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ, రైల్వే ఒప్పంద కార్మికుల సమస్యలపై నిర్దిష్ట చర్యలు చేపట్టాలని విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు సీపీఎం విజ్ఞప్తి చేసింది. పార్టీ నాయకులు జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, శ్రీనివాసరాజులు గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిశారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయించాలని, నేవల్ డాక్‌యార్డు వద్దనున్న వంతెన పునః నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు ఎస్ బీసీ వంతెన మీదుగా ప్రయాణికుల వాహనాలు రాకపోకలకు అనుమతించేలా చూడాలని కోరారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణతో ఇబ్బందులు, రైల్వే ఒప్పంద కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.



సేవకుని ప్రతిభతో సాయినాథునికి పూల శాలువా

మురళీనగర్, న్యూస్‌టుడే: భగవంతునిపై భక్తి ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా ఉంటుంది. అదే కోవలో కాలనీకి చెందిన సాయి సేవకుడు శిర్డీసాయినాథుని కోసం ప్రత్యేకంగా చేతితో అల్లిన సహస్రపూల శాలువాతో సాయిని అలంకరించి తన భక్తిని చాటుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం సాయినాథునికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయి మహాసమాధి శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమవుతుందని ఆలయ ప్రధాన అర్చకులు అయిలూరి రామశాస్త్రి తెలిపారు.

'ఫ్రీహోల్డ్' భూములపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయొచ్చు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై పారదర్శకంగా విచారణ చేపట్టామని కలెక్టరు హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 'ఈనాడు'లో 'విచారణలో లోతేది..అక్రమాలెలా తేలేది' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. '19.12.2023న ప్రభుత్వ ఉత్తర్వులు 596 ప్రకారం విశాఖ జిల్లాలో సుమారు 626.06 ఎకరాల డీపట్టా భూములను ఫ్రీహోల్డ్ చేశాం. వాటిల్లో 135.472 ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిపై భూపరిపాలనశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలోని ఉపకలెక్టర్ల ఆధ్వర్యంలో నియమించిన బృందాలతో విచారణ చేయించాం. గతంలో పనిచేసిన అధికారులను అదే మండలానికి కేటాయించకుండా వేరే మండలాలకు కేటాయించాం. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, గ్రామసభలు నిర్వహించి, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించి వాటన్నింటినీ నిశితంగా పరిశీలించిన తర్వాతే నివేదిక సమర్పించాం. ఫ్రీహోల్డ్ జరిగిన భూములపై ప్రజలెవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టరు, సంయుక్త కలెక్టరుకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటాం' అని ప్రకటించారు.

ఫ్రీహోల్డ్ భూములపై జిల్లా కలెక్టరు ఆరా..

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి మండలం అన్నవరం గ్రామంలో జిల్లా కలెక్టరు హరేంధిరప్రసాద్ గురువారం పర్యటించారు. గ్రామంలోని ఫ్రీహోల్డ్ భూములు, ల్యాండ్ పూలింగు కింద సేకరించిన భూములను సంబంధిత దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వాటి పరిస్థితి తెలుసుకున్నారు. సంబంధిత రైతులతో మాట్లాడి వాస్తవాలపై వివిధ కోణాల్లో ఆరా తీశారు. ఈ గ్రామంలో దాదాపు రెండొందల ఎకరాల వరకూ ఫ్రీహోల్డ్, ల్యాండు పూలింగు భూములున్నాయి. వీటిపై రైతులు గతంలో ఆందోళనలు కూడా చేశారు. ఈ అంశానికి సంబంధించి ఇటీవల విచారణ కమిటీలు కూడా వేశారు. ఈ నేపథ్యంలో కలెక్టరు పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తహసీల్దారు రామారావు, ఉప తహసీల్దారు శ్రీనుబాబు, సర్వేయర్లు, సిబ్బంది కలెక్టరు వెంట ఉన్నారు.



అన్నవరం గ్రామంలో క్షేత్ర స్థాయిలో ఫ్రీహోల్డ్ భూముల దస్త్రాలు పరిశీలిస్తున్న కలెక్టరు హరేంధిర ప్రసాద్



తుంగ్లాంలో 1108 దీపాలతో అమ్మవారికి దీపాలంకరణ –న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం

దంతెవాడ-జగదల్‌పూర్ మధ్య జనసాధారణ రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో దంతేశ్వరి అమ్మవారి భక్తుల రద్దీ దృష్ట్యా దంతెవాడ-జగదల్‌పూర్ మధ్య మూడు జతల ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జగదల్‌పూర్-దంతెవాడ-జగదల్‌పూర్(08513-08514), ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు జగదల్‌పూర్-దంతెవాడ(08515), ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు దంతెవాడ-జగదల్‌పూర్ (08516), ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జగదల్‌పూర్-దంతెవాడ-జగదల్‌పూర్(08511-08512) ప్రత్యేక సాధారణ రైళ్లు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైళ్ల సేవలు వినియోగించుకోవాలని కోరారు.

మద్యం దుకాణాలకు పోటాపోటీ

మాధవధార, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు ప్రభుత్వం గడువు పెంచడంతో పోటాపోటీగా దరఖాస్తులు వేస్తున్నారు. గడువు శుక్రవారం సాయంత్రం 7 గంటలతో ముగుస్తోందని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామ చంద్రమూర్తి తెలియజేశారు. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని, 14న సిరిపురం బాలల ప్రాంగణంలో లాటరీ తీస్తారన్నారు. నూతన మద్యం విధానం ప్రకారం 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. గడువు పెంచడంతో కొన్ని దుకాణాలకు 10 నుంచి 20 దరఖాస్తులు వస్తున్నాయన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో సగటున ఒక షాపునకు 18, అల్లూరి జిల్లాలో ఒక షాపునకు 22 దరఖాస్తులు వచ్చినట్లుగా అయన తెలిపారు.

గురువారం రాత్రి 9 గంటల వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో దరఖాస్తుల వివరాలు

జిల్లా	షాపులు	దరఖాస్తులు
విశాఖ	155	2851
అనకాపల్లి	136	2455
అల్లూరి	40	869
మొత్తం	331	6175

★ మద్యం దుకాణాలకు వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఏ దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో చూసుకోవచ్చునన్నారు.

★ అల్లూరి జిల్లాలో పెరిగిన దరఖాస్తులు: అల్లూరి జిల్లాలో మద్యం దుకాణాలకు గురువారం ఒక్కసారిగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ తెలంగాణ సరిహద్దులో ఉన్న చింతూరు, రంపచోడవరంలో పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన మద్యం దొరక్క మందుబాబులు సరిహద్దున ఉన్న తెలంగాణ భూ భాగంలోకి వెళ్లి తాగేవారు. ఏపీలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతోపాటు, తక్కువ ధరకు నాణ్యమైన సరకు విక్రయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో తెలంగాణ నుంచి పెద్దఎత్తున దరఖాస్తులు వేస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 40 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. బుధవారం వరకు ఇక్కడ 796 దరఖాస్తులు రాగా, గురువారం ఒక్కరోజే 56 దరఖాస్తులు వచ్చాయి. చింతూరు 80 శాతం, రంపచోడవరంలో 20 శాతం మంది తెలంగాణకు చెందిన వారే దరఖాస్తులు నమోదు చేశారు. వీరితో పాటుగా ఏపీ సరిహద్దు ఒడిశా, దిల్లీ నోయిడా నుంచి కూడా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసినట్లుగా అధికారులు తెలిపారు.

★ 14 దుకాణాలకు 556 దరఖాస్తులు: అల్లూరి జిల్లాలో చింతూరు, రంపచోడవరంలో ఉన్న 14 దుకాణాలకు ఒక్కొక్క దుకాణానికి 30కు పైగా దరఖాస్తులు వేశారు. మొత్తం 14 దుకాణాలకు 556 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా షాపు నెంబర్ 39కి 59, 38కి 52, 37కి 54 దరఖాస్తులు వచ్చాయి.

★ రుసుముల రూపంలో 123.50 కోట్లు: ఉమ్మడి విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల కోసం బుధవారం రాత్రి 9 గంటల వరకు 6175 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీంతో తిరిగి ఇవ్వని రుసుముల రూపంలో ప్రభుత్వానికి రూ.123.50కోట్లు ఆదాయం సమకూరింది. శుక్రవారం చివరి రోజు మరిన్ని దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

భూ వివాదంలో భాజపా నేత అరెస్టు


గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భూముల వివాదంలో భాజపా నగర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కోడూరు సంజీవరావు, ఆయన తండ్రి రామారావులను గురువారం అరెస్టు చేసినట్లు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు. భీమిలి మండలం రామయోగి అగ్రహారంలో వారసత్వంగా తనకు వచ్చిన భూమి కోసం సంజీవరావు కొద్దికాలంగా పోరాడుతున్నారన్నారు. ఆ నేపథ్యంలో 2021వ సంవత్సరంలో ఈయనపై డాక్యుమెంటు ఫోర్జరీ, చీటింగు కేసు నమోదైనట్లు చెప్పారు. ఆ మేరకు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పీపీపీ ప్రాజెక్టుకు అనుమతి

న్యూస్‌టుడే, పెదవాల్తేరు: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో కైలాసగిరి కొండ మీద చేపట్టే పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంటు, కేఫ్‌ల నిర్మాణం రూ.పది కోట్లతో చేపట్టనుండడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి ఆ మేరకు ఆమోదిస్తూ ఉత్తర్వులిచ్చింది. ★ వీఎంఆర్‌డీఏ అటవీ విభాగంలో ఎఫ్ఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న బి.శ్యామల డిప్యుటేషన్ పొడిగింపు అనుమతిని ప్రభుత్వం తిరస్కరించింది. మరో ఏడాది పాటు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరగా అయిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో కొనసాగింపునకు అనుమతించలేదు.

ఉల్లిపాయల లారీ బోల్తా

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున శొంఠ్యాం సమీపంలో ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న ఓ లారీ బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి ఉల్లిపాయల లోడుతో కోల్‌కతా వెళ్తున్న లారీ ఆనందపురం సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా రహదారి రెయిలింగ్‌ని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. వారిని విశాఖ కేజీహెచ్ వైద్యశాలకు తరలించారు. రోడ్డుపై పడిన ఉల్లిపాయలను పక్కకు తీయించి వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు. వాటిని ఇతరులెవరూ తరలించకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తర్వాత వేరొక వాహనం ద్వారా వాటిని గమ్యస్థానానికి తరలించే ఏర్పాటు చేసినట్లు సీఐ సీహెచ్.వాసునాయుడు పేర్కొన్నారు.



ఉక్కులో రహస్య మంతనాలపై ఆరా

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో కీలక కార్మిక నేత ఒకరు మూడు రోజుల కిందట ఉక్కు ఉన్నతాధికారిని రహస్యంగా కలిసి మంతనాలు జరిపినట్లు పలు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఓ వైపు ఉక్కు పరిరక్షణకు, మరోవైపు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేస్తున్న సమయంలో...అన్ని సంఘాలను విస్మరించి కేవలం ఒక్క కార్మిక నేత మాత్రమే కలవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. స్వప్రయోజనాల కోసమే మంతనాలు జరిగాయని వారు అభిప్రాయపడుతున్నారు.

నగరం పచ్చగుండాలి

❑ అందుబాటులో ఏపీ గ్రీన్ కార్పొరేషన్ నర్సరీ ❑ ఆర్డరిస్తే మొక్కల సరఫరా

న్యూస్‌టుడే, ఉషోదయకూడలి (ఎంవీపీకాలనీ), ఆరిలోవ

ఉద్యానవనాలు... కార్యాలయాలు... పాఠశాలలు.. సదస్సులు... సమావేశాలు... విభాగినులు.. ఇలా ఒకటేమిటి ఎక్కడ పచ్చదనం కావాలన్నా అందరికి ఠక్కున గుర్తుకువచ్చేది 'ఏపీ గ్రీన్ కార్పొరేషన్ నర్సరీ'. నగరంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన జి.20 సదస్సుకు కూడా ఇక్కడి నుంచే మొక్కల సరఫరా జరగటం విశేషం. కేంద్ర కారాగారానికి సమీపంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 37 ఎకరాల భూమిని లీజుకు తీసుకుని వేలాది రకాల మొక్కలు, చెట్లను ఇక్కడ పెంచుతున్నారు.

2015లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్రంలో విశాఖపట్నం, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు మొక్కల సరఫరానే ఈ నర్సరీల ఏర్పాటు ప్రధాన లక్ష్యం.



నర్సరీలో మొక్కల సంరక్షణ

● కడియం నుంచి మొక్కలను తీసుకువచ్చి ఇక్కడ నాట్లు కట్టి సంరక్షిస్తుంటారు. ఏడాది నుంచి రెండేళ్ల జీవిత కాలం కలిగిన అరుదైన జాతికి చెందిన అలంకరణ మొక్కలను తీసుకువచ్చి, ఇక్కడ వాటిని పెంచి, అమ్మకానికి ఉంచుతారు. అవసరమైన ప్రాంతాల్లో వీటిని అలంకరణకు సైతం ఉపయోగిస్తున్నారు. నగరంలో ఏర్పాటు చేసిన 37 ఎకరాల నర్సరీలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నీడ అవసరమైన మొక్కలను పెంచేందుకు నాలుగు గ్రీన్ హౌస్‌లు ఏర్పాటు చేశారు. వాటి పైభాగంలో స్ప్రింక్లర్లను ఏర్పాటు చేశారు.

● రహదారులకు ఇరువైపులా నాటేందుకు వీలుగా 45 రకాల మొక్కలు, చెట్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. రావి, మర్రి, వేప, చింత, మామిడి, తెల్లమద్ది, టబుబియా, ఫైకస్ లైరెట్, స్నాక్‌టైల్ పామ్ వంటి జాతులకు చెందిన చెట్లు అనేకం లభిస్తున్నాయి.

● సుందరీకరణలో భాగంగా 19 రకాల వివిధ జాతుల మొక్కలను ఇక్కడ సిద్ధంగా ఉంచుతున్నారు. నందివర్ధనం, ఎగ్జోరా, స్పైడర్‌లిల్లీ, బోగన్‌విలియా, దేవగన్నేరు, ఫైకస్ మల్టీహెడ్ వంటి వృక్ష జాతులను సంరక్షిస్తున్నారు.



వివిధ రకాల అలంకరణ మొక్కలు

● కేవలం ఇంటి లోపలి (ఇండోర్) అలంకరణ మొక్కలు మినహా అన్ని రకాల మొక్కలు, చెట్లు ఇక్కడ లభిస్తున్నాయి. కేవలం ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకే కాకుండా ప్రైవేటు సంస్థలకు కూడా మొక్కలు సరఫరా చేస్తారు. అయితే విజయవాడలోని ఏపీ గ్రీన్ కార్పొరేషన్ కార్యాలయానికి మొక్కలు కావాలంటూ లేఖ రాస్తే చాలు ఇక్కడి నుంచి మొక్కలను సరఫరా చేస్తామని అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – వేట్టయాన్ ది హంటర్
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– శ్వాగ్, చోటుమహరాజ్
(ఆనందపురం) – వేట్టయాన్ ది హంటర్

ఇస్కాన్‌లో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరంలో ఈనెల 12న దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ తెలిపారు. ఈ మేరకు ఇస్కాన్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం దాదాపు 50 అడుగుల రావణ కటౌట్ దహన కార్యక్రమాన్ని కనులపండువగా చేపడతామన్నారు. ఎప్పటికీ చెడుపై మంచి విజయం సాధిస్తుందని అభివర్ణించే రీతిలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా జరుపుతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: శివశక్తినగర్(మధురవాడ) ప్రధాన రహదారిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. –సత్యనారాయణ, శివశక్తినగర్
సమాధానం: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. –కిషోర్, ఆరోగ్య అధికారి

సమస్య: సినీపోలీస్(మధురవాడ) థియేటర్ పరిసర ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. –శాంతమ్మ, మధురవాడ
సమాధానం: పందుల నివారణకు చర్యలు చేపడతాం. –కిషోర్, ఆరోగ్య అధికారి

సమస్య: తారకరామా లేఅవుట్(రుషికొండ) పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. –స్థానికులు, తారకరామా లేఅవుట్
సమాధానం: వీధి దీపాలకు మరమ్మతులు చేపడతాం. –సురేష్, విద్యుత్ ఏఈ

రాకపోకలకు నిత్యం అవస్థలే..

రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాల నిలిపివేత

పీఎంపాలెం, మధురవాడ, న్యూస్‌టుడే

జోన్-2 మధురవాడ, పీఎంపాలెం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన మార్గాల్లో వాహనాల అనధికారిక పార్కింగ్‌తో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్కింగ్ వసతు ల్లేని దుకాణ సముదాయాల వల్ల ఈ సమస్య మరింత అధికంగా ఉంటోంది. సంబంధిత మార్గాల్లో పార్కింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా వేస్తామని బోర్డులున్నా.. ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.


చంద్రంపాలెం సేవామార్గంలో..

ఎక్కడెక్కడంటే.....

★ కారుషెడ్డు కూడలి నుంచి పీఎంపాలెం వెళ్లే ప్రధాన రహదారి ప్రారంభంలో ఇరువైపులా దుకాణ సముదాయాల వద్ద ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
★ మిథిలాపురి వుడాకాలనీ రెండు లైన్ల రోడ్డులో పలువురు వ్యాపారులు కాలిబాటలు, రోడ్లు సైతం ఆక్రమించి దుకాణాల ఏర్పాటు చేయడం వల్ల ఈ సమస్య మరింత జటిలం అవుతోంది. ★ చంద్రంపాలెం సమీపం నుంచి కొమ్మాది కూడలి వరకు సేవా మార్గంలోని దుకాణాలకు వచ్చే వినియోగదారుల వాహనాలు భారీగా నిలిచి ఉంటున్నాయి.★ మధురవాడ ఎత్తు వంతెన వద్ద నగరంపాలెం వెళ్లే రోడ్డు ఆరంభంలో చిల్లర దుకాణాల కారణంగా.. ★ పీఎంపాలెం పోలీసు స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో దుకాణ సముదాయాల ఎదురుగా..



మిథిలాపురి వుడాకాలనీలో హెచ్చరిక బోర్డు ఉన్న చోటే ఇలా..

★ మధురవాడ మార్కెట్ నుంచి స్వతంత్రనగర్‌కు వెళ్లే రహదారిపై.. ★ ఎండాడ బేలన్సింగ్ రిజర్వాయర్ వద్ద, పనోరమ హిల్స్‌కు వెళ్లే ప్రధాన మార్గం ఆరంభ మలుపు వద్ద..

కేసులు నమోదు చేస్తున్నాం....

ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్న చోట నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. అనధికారిక పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపితే జరిమానా వేస్తామని ఇప్పటికే పలుచోట్ల బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనదారులు సంబంధిత నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి. లేకుంటే జరిమానాలు తప్పవు. –జి.ప్రసాద్(పీఎంపాలెం, ట్రాఫిక్ ఎస్సై)

సేవలకు గుర్తింపు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ (విశాఖపట్నం) గ్రూప్ నుంచి 'బెస్ట్ ఎన్‌సీసీ యూనిట్' అవార్డు రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాలకు దక్కిందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.ఎం.రెడ్డి తెలిపారు. జీవీపీ కళాశాల వేదికగా జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల 13 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణలో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జీవీపీ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్‌కు ఈ అవార్డు అందజేశారు. సామాజిక బాధ్యతగా స్వచ్ఛభారత్‌లో భాగంగా తీర ప్రాంతాల పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణ దిశగా మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాల నిర్వహణ తదితర పలు సేవా కార్యకలాపాలు చేపట్టినందుకు ఈ అవార్డు దక్కడం అభినందనీయమని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్, కెప్టెన్ ఆర్.బి.అనంతరావు, కెప్టెన్ ఉమానాగేశ్వరి, సుబేదార్ మేజర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.



జీవీపీ ప్రిన్సిపల్ బోస్‌కు 'బెస్ట్ ఎన్‌సీసీ యూనిట్' అవార్డు అందజేస్తున్న వి.ఎం.రెడ్డి

వారపు సంత తరలింపు తగదు

కొమ్మాది, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా మధురవాడలో శనివారం సంత నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న చిరువర్తకులను మరోచోటికి తరలించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, చిరువర్తకులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్-2 కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా గురువారం సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. జెడ్సీ గది ఎదుట కొంతసేపు బైఠాయించారు. అనంతరం జెడ్సీ పి.సింహాచలం, పీఎంపాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణతో ప్రజాసంఘాల నాయకులు ఎం.లక్ష్మీ, ఎం.వెంకటేశ్వర్లు, పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు కొద్దిసేపు చర్చించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.



జోన్-2 కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిరువర్తకుల నిరసన

కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ

పద్మనాభం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పద్మనాభం కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థిని ఉత్తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ గ్రేస్ లిలీ తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మొకర హాసిని జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు విశాఖలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ విద్యార్థినికి ప్రశంసాపత్రం, రూ.మూడు వేల చెక్కు అందించి అభినందించారని ఆమె పేర్కొన్నారు.



హాసినికి ధ్రువపత్రం, చెక్కు అందించి అభినందిస్తున్న కలెక్టర్

రెండేళ్లుగా తాగునీటికి ఇక్కట్లు

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం గురువారం పద్మనాభం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో బి.విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ కె.రాంబాబు శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో సీసీ రోడ్లు, కాల్వలు పనులు చేపట్టనున్న మండల ఇంజినీర్ కోరగా ఇసుక, గ్రావెల్ కొరత లేకుండా చూడాలని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనుల వల్ల రెండేళ్లుగా రెడ్డిపల్లి, శేరీఖండం గ్రామాలకు తాగునీరు అందడం లేదని శేరీఖండం సర్పంచ్ పల్లి చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీపై ఎవరికైనా ఆసక్తి ఉంటే సంప్రదించాలని వ్యవసాయాధికారి చలం సూచించారు. ఉపాధి హామీ పథకం ఇబ్బందులపై పాండ్రంగి సర్పంచ్ పల్లె ఝాన్సీ వివరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా గృహ నిర్మాణ పథకం ఇళ్లు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారి వెల్లడించారు. జడ్పీ ఉపాధ్యక్షుడు ఎస్.గిరిబాబు, ఎంపీటీసీ ఈర్ల రాజేశ్వరి, తహసీల్దార్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డు సమస్యలపై జెడ్సీకి వినతి

కొమ్మాది, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా పాలనలో 8వార్డులోని పలు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని జోన్-2 జెడ్సీ పి.సింహాచలంకు స్థానిక తెదేపా నాయకులు వినతిపత్రం అందించారు. జోన్-2 కార్యాలయంలో గురువారం తెదేపా 8వార్డు అధ్యక్షుడు చెట్టిపల్లి గోపి తదితరులు జెడ్సీకి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కాలనీల్లో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని, అంతర్గత రహదారులు, కాలువలు నిర్మించాలని తదితర సమస్యలపై జెడ్సీకి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ

పద్మనాభం, న్యూస్‌టుడే: మండలంలోని 22 పంచాయతీల ఉప సర్పంచులకు, ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు ఈనెల 15, 16, 17, 18 తేదీల్లో మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.విజయ్‌ప్రసాద్ తెలిపారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలనపై అవగాహన కల్పిస్తూ సభ్యులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌తో పాటు ఎంపిక చేసిన వార్డు సభ్యుల పేర్లను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని ఎంపీడీవో కోరారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం (జాతర)లో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నగరానికి చెందిన మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ చిన్నారులు వారి హావభావాలతో నర్తించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు డి.మీనాక్షి దర్శకత్వం వహించారు. శుక్రవారం సాయంత్రం 6గంటల నుంచి జోష్ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన ఉంటుందని పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.



ఫౌంటెయిన్ మూణ్నాళ్ల ముచ్చటేనా..!

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ వద్ద జీవీఎంసీ గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ పనితీరు మూణ్నాళ్లముచ్చటగా తయారైంది. ఇందులోని నీరు ఎప్పటికప్పుడు మార్చకపోవడంతో నాచు పట్టి దుర్వాసనతో అధ్వానంగా తయారైంది. ఎగజిమ్మే నీటిధారలు బాగా తగ్గిపోయాయి. గతంలోనే ఇది మొరాయించగా జీవీఎంసీ అధికారులు ఆరునెలల క్రితమే తిరిగి అందుబాటులోకి తెచ్చారు. ప్రతీరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య విద్యుత్తు కాంతులతో నీటిని ఎగజిమ్మే ఫౌంటెయిన్ చూపరులను విశేషంగా ఆకట్టుకునేది. ప్రస్తుతం ఇది పనిచేయకపోవడంతో సందర్శకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. దీనికి మళ్లీ మరమ్మతులు చేయించి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



భీమిలి బీచ్‌రోడ్డులో కళావిహీనంగా.


గోశాల లేఅవుట్‌లో..


విజినిగిరి పాలెంలో..


తొలిపావంచా వద్ద..


భీమిలి సాగర తీరాన క్షేత్రంపై..


ప్రత్యేక అలంకరణలో కాత్యాయని


వాసవీ కన్యకా పరమేశ్వరి


మారం ఆంజనేయులు నగర్‌లో..


శ్రీసిద్ధేశ్వరస్వామి పీఠం ఆవరణలో..


చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గమ్మ

నవదుర్గా రూపిణీ.. నమో నమామి

నియోజకవర్గంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని గురువారం అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అర్చకులు జగన్మాత సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలతో అర్చించారు. పలు చోట్ల ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో అన్న సమారాధనలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సింహాచలం, భీమునిపట్నం, మధురవాడ, కొమ్మాది, ఎండాడ, సాగర్‌నగర్, ఆనందపురం, తగరపువలస, గ్రామీణభీమిలి


ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో..


టి.నగరపాలెంలో..


భీమిలి బిల్లలమెట్టలో..


ఎండాడ దుర్గాదేవి ఆలయంలో...


గీతం వైద్య కళాశాల ఆవరణలో..


సాగర్‌నగర్ బంగారమ్మ గుడిలో..


గుడ్లవానిపాలెం అమ్మవార్ల ఆలయాల ప్రాంగణంలో...


కాపుల దిబ్బడిపాలెంలో..


కె.నగరపాలెం కూడలిలో..


అన్నవరం కొత్తపేటలో..


తాటితూరులో..


ఆనందపురం మండలం వెంకటాపురంలో..

శంఖు చక్రాల వెలుగులకు సన్నాహాలు

స్పందనకు వందనం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై వైకుంఠవాసుల మెట్ట సమీపంలో జీఆర్‌టీ జువెలర్స్ సహాయంతో ఏర్పాటు చేసిన శంఖు చక్రాలు, తిరునామాల విద్యుద్దీపాలంకరణను త్వరలో ప్రారంభించనున్నట్లు దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తెలిపారు. దూర ప్రాంతాల భక్తులకు కనిపించేలా ఈ శంఖు చక్రాల విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు పనులు కొద్ది నెలల క్రితం చేపట్టిన పనుల్లో జాప్యం తలెత్తింది. ఈ నేపథ్యంలో గత నెల 30వ తేదీన 'శంఖు చక్రాల వెలుగులెప్పుడో..!' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచారు. ఎల్‌ఈడీ దీపాల అమరిక పూర్తి కావడంతో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ముహూర్తం నిర్ణయించి త్వరలో వీటిని ప్రారంభిస్తామని ఈఈ పేర్కొన్నారు.



అధికారులకు సత్కారం

పద్మనాభం, న్యూస్‌టుడే: మండలంలో వివిధ స్థానాల్లో పని చేసి ఇటీవల బదిలీ అయిన అధికారులను మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సత్కరించారు. వెలుగు ఏపీఎం ప్రభాకర్, వివిధ గ్రామాలకు చెందిన గ్రామ కార్యదర్శులను ఎంపీపీ కె.రాంబాబు, తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో విజయ్‌కుమార్‌ల చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడి సన్నిధిలో గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.




ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

వేడుకగా అమ్మవార్ల తిరువీధి


చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి వైభవోపేతంగా జరిగింది. అర్చకులు చతుర్భుజ తాయార్, స్వర్ణలక్ష్మీ అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. వీరలక్ష్మీ ఆరాధనలో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. పండితులు ఆలయ హంసమూలన శ్రీరామాయణం పారాయణం చేశారు.

ఉత్సాహంగా కోలాటం పోటీలు

చిప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలస్థాయి కోలాటం పోటీలు భీమిలి మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఛైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎమ్పీడీవో కనకల రమేశ్‌నాయుడు ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణప్రాంత కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సీనియర్స్ విభాగంలో చిప్పాడ సుత్తమ్మతల్లి జట్టు, జూనియర్స్ విభాగంలో యాత కుమ్మరిపాలెం సరస్వతి బృందం విజేతలుగా నిలిచాయి. నిర్వాహకులు అతిథుల చేతులమీదుగా వీరికి బహుమతులు అందించారు. ఈనెల 12వ తేదీన భీమిలిలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి, మాజీ వైస్ ఎంపీపీ గరికిన పరశురాం, మాజీ జడ్పీటీసీ సభ్యులు సరగడ అప్పారావు, బోర బంగారరెడ్డి, జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి, ఎంఈవోలు శివరాణి, జయప్రద, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు, ఉపాధ్యక్షులు అనిల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన


కోలాటం సీనియర్స్ విజేత చిప్పాడ జట్టుతో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, ఎమ్పీడీవో రమేశ్‌నాయుడు, తదితరులు

చెత్తకు నిప్పు... ఆరోగ్యానికి ముప్పు

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో నివాసాల మధ్య చెత్తను కుప్పలుగా వేసి పారిశుద్ధ్య సిబ్బంది తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ వ్యాపించి కాలనీ వాసులు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్‌యార్డుకు వ్యర్థాలు తరలించకుండా కాలనీలో పలుచోట్ల సిబ్బంది ఇలా చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ జోన్-2 సహాయ వైద్యాధికారి స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వాంబే కాలనీలో నివాసాల మధ్య ఇలా..

విశాఖ తూర్పు



పోటీపడుతూ... దూసుకుపోతూ...

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : స్కేటర్లు ఒకరితో మరొకరు పోటీ పడుతూ రింక్‌లో తమ నైపుణ్యాలను ప్రదర్శించి, న్యాయనిర్ణేతలను మెప్పించారు. విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు శివాజీపార్కులో రెండోరోజు కొనసాగాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఇన్‌లైన్, స్టైల్ డ్యాన్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. బాలురు, బాలికలు వయసుల వారీగా వేర్వేరుగా పోటీ పడ్డారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వరదల సమయంలో విజయవాడలో అందించిన సేవలకు గాను 28వ వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బందికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. రామ్‌నగర్ పార్కు వద్ద గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శాలువాలు వేసి సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

★ సమస్య : బాలాజీపార్కు వద్ద కొమ్మల వ్యర్థాలు తరలించటం లేదు. – లక్ష్మి

★ సమాధానం: ఇప్పటికే కొంత తరలించాం. మిగిలినది సిబ్బందిని నియమించి తరలిస్తాం. –సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆసుపత్రికి సహాయ సహకారాలు అందజేస్తాం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ మానసిక ఆసుపత్రి ఆవరణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని డీసీపీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తమ శాఖ పరంగా ఆసుపత్రికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ మానసిక రోగుల రక్షణకు రూపొందించిన చట్టాలను వివరించారు. జిల్లా మానసిక ఆరోగ్యం సమీక్ష బోర్డు ఛైర్మన్ బి.రామారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి, విశాఖ మానసిక వైద్యుల సంఘం అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ రమాకాంత్, డాక్టర్ డి.విజయలక్ష్మి, వైద్యులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ అజిత, చిత్రంలో న్యాయమూర్తి శేషమ్మ, తదితరులు

హడలెత్తిస్తున్న జ్వరాలు

అంతంతమాత్రంగా దోమల నియంత్రణ

“ నియోజకవర్గంలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దోమల నియంత్రణలో యంత్రాంగం అలసత్వం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చితే డెంగీ కేసులు తగ్గినా ఈ ఏడాది జోన్-3లో ఇప్పటి వరకు డెంగీ జ్వరాల కేసులు 60 వరకు నమోదయ్యాయి. మలేరియావి 20 వరకు నమోదు కావటం విశేషం. అయితే ఇవి కేజీహెచ్‌లో నమోదైనవి మాత్రమే. మరి ప్రైవేటుగా ఎన్ని కేసులు నమోదయ్యాయో అనేది స్పష్టత లేదు. ” – న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సిబ్బందిని నియమించినా ఫలితం శూన్యం...: సాధారణంగా జ్వరాలు ఎండ తక్కువగా ఉన్న సమయంలో విజృంభిస్తుంటాయి. వర్షాలు కురిస్తే చాలు నీటి నిల్వలు పేరుకుపోయి దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. దీంతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. సీజనల్ జ్వరాల విషయానికి వస్తే జూన్ నుంచి అక్టోబర్ వరకు ఉంటుంది.

★ జ్వరాలు పెరుగుతున్న సమయంలో దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్‌ఓ) ఫాగింగ్ చేపడుతుంటారు. దోమలు పెరగకుండా లార్వా దశలోనే అంతం చేసేలా అన్ని ప్రాంతాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటివి చేపట్టాలి. ఇందుకోసం వార్డుకు 5 నుంచి 10 మంది వరకు అదనపు సిబ్బందిని నియమిస్తారు.



నామమాత్రంగా జరుగుతున్న ఫాగింగ్

★ వార్డుకు ఒక హెల్త్ అసిస్టెంట్ ఉండాలి. గతంలో ఉన్న హెల్త్ అసిస్టెంట్‌లను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించటంతో అదనపు సిబ్బందిలో ఒకరికి పర్యవేక్షణ బాధ్యతను అప్పగిస్తున్నారు. దీంతో నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని వార్డుల్లో అదనపు సిబ్బంది అంతా ప్రజాప్రతినిధులు చెప్పిన వారే ఉండటంతో వారు పనితీరును ఎవరూ పట్టించుకోవటం లేదనే తెలుస్తోంది. దీంతో యాంటీ లార్వా ఆపరేషన్ అనేది సరిగా జరగటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

★ ఇక ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటివి చేసే సమయంలో దోమల నియంత్రణ మందును సరైన విధానంలో ఉపయోగించాలి. తగినంత గాఢతతో జరగటం లేదని విమర్శలున్నాయి. నిర్దేశించిన గాఢతతో జరగకపోతే దోమలు తమ వృద్ధిని మరింత పెంచుకునే అవకాశాలు లేకపోలేదు. అయితే దీన్ని పరిశీలించే సాంకేతిక సిబ్బంది కూడా లేరు. ఫ్రైడే.. డ్రైడే పేరిట ప్రతీ ఇంటికి వెళ్లి దోమల నియంత్రణపై అవగాహన కల్పించి, నీటి నిల్వలు లేకుండా చూడాల్సి ఉన్నా, ఇది మొక్కుబడిగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

★ దీంతో చినవాల్తేరు, ఫిషర్‌మెన్‌కాలనీ, అప్పుఘర్, ఆదర్శనగర్, ఆరిలోవ, తోటగరువు వంటి ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు డెంగీ కేసులు నమోదు కావటం విశేషం. ఇప్పటికైనా యంత్రాంగం సరైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రాయితీ టమోటాకు భారీ వరుస

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : టమోటా ధరలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కిలో రూ.50కు విక్రయిస్తుండటంతో దీనికి విశేష ఆదరణ లభించింది. రైతుబజారులో వీటి కోసం వినియోగదారులు బారులు తీరారు. గురువారం ఒక్కరోజే 3200 కిలోల టమోటాలు విక్రయించారు. రాయితీ టమోటా విక్రయాలకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

★ రైతుబజారులో వంట నూనెలు తగ్గింపు ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వంటనూనెల విక్రయాలను జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి భాస్కరరావు అధికారికంగా ప్రారంభించారు. సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్ నూనెలను విక్రయించారు.



టమోటా కోసం ఎండలో బారులు తీరిన వినియోగదారులు

సరస్వతీ విద్యార్థికి నేదునూరి కృష్ణమూర్తి స్మారక పురస్కారం ప్రదానం

స్వర్ణభారతి, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో నగరానికి చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసురాలు, ఏయూ సంగీత విభాగం పూర్వఅధిపతి డాక్టర్ సరస్వతీచే సంగీత గాత్ర కచేరీ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా విశాఖ మ్యూజిక్ అకాడమీ సంస్థ తరపున సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి స్మారక పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పలు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.వి.రామమూర్తి, బి.ఎ.రాజారావు, ఎం.ఎస్.శ్రీనివాస్, వి.చంద్రశేఖర్, సి.హెచ్.దుర్గాప్రసాద్, భుజంగరావు పాల్గొన్నారు.



సరస్వతీ విద్యార్థికి పురస్కారం అందజేస్తు న్న దృశ్యం

ఇక్కడ నిత్యం ఇదే కృత్యం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : హనుమంతువాక కూడలిలో ట్రాఫిక్ ప్రతీరోజు పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి 7.30 గంటల వరకు రద్దీ అధికంగా ఉంటోంది. పండగల సమయంలో ఆ రద్దీ మరీ అధికంగా ఉంటోంది. ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిగానీ, ఫ్లైఓవర్ బ్రిడ్జిగానీ నిర్మిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రయాణికులు అంటున్నారు.



హనుమంతువాక కూడలిలో ట్రాఫిక్ రద్దీ

‘మా పొట్టలు కొట్టొద్దు..’

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : పిఠాపురంకాలనీ కళాభారతి రహదారి మార్గంలో చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు కొంత ఉద్రిక్తతకు దారితీసింది. వీటిని తొలగించడానికి జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది రావడంతో చిరు వ్యాపారులు దీనిని అడ్డుకున్నారు. మా పొట్టలు కొట్టొద్దని ఏసీపీ వెంకటేశ్వరరావు, టీపీఓ ప్రమీలారాణిలను కోరారు. ఈ సమయంలో సిబ్బందికి, చిరు వ్యాపారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ రహదారిపై దుకాణాల ఏర్పాటుపై వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ గతంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత కొన్ని నెలల నుంచి ఈ వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న తెదేపా నాయకులు బొట్టా వెంకటరమణ అక్కడకు చేరుకుని చిరు వ్యాపారులకు కాస్త సమయం ఇవ్వాలని కోరడంతో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది వెనుదిరిగారు. స్థానిక తెదేపా నాయకులు ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పోలీసులు కూడా అక్కడకు చేరి పరిస్థితి సమీక్షించారు.



చిరు వ్యాపారస్తులతో మాట్లాడుతున్న జోన్-3 ఏసీపీ వెంకటేశ్వరరావు, చిత్రంలో స్థానిక తెదేపా నాయకులు

ఏయూని సందర్శించిన ఆస్ట్రేలియన్ కాన్సులేట్ అధికారి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : చెన్నైలోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ అధికారి డేవిడ్ ఎగ్లెస్టన్ గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆయన ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఇతర ఏయూ అధికారులతో ఏయూ, ఆస్ట్రేలియన్ విశ్వవిద్యాలయాల మధ్య విద్యాపరమైన సహకారాలపై చర్చించారు. కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య నిరంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేవిడ్ ఎగ్లెస్టన్‌ను వీసీ సత్కరించి జ్ఞాపిక అందించారు.



డేవిడ్ ఎగ్లెస్టన్‌ను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

అ వీ ఇ వీ

కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలి

ఆటోమోటివ్ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : తోపుడు బండ్ల కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావ్ అన్నారు. గురువారం మద్దిలపాలెం సిటీ డిపో కాంప్లెక్సు ప్రహరి వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దిలపాలెం జాతీయ రహదారికి ఆర్టీసీ ప్రహరి పక్కన గత 20 సంవత్సరాలుగా తోపుడుబండ్ల కార్మికులు చిల్లర వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారిని ఆర్టీసీ యాజమాన్యం తొలగించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. తక్షణమే ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దుకాణాలు తొలగిస్తే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పి.వి.గిరిధర్, సీపీఎం నాయకులు సింహాచలం, ఎ.అప్పారావు, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : నవంబరు 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్కేబీచ్‌లో భారీస్థాయిలో రన్‌ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అనే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య జాన్‌కోటి, తెదేపా ప్రధాన కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఘన విజయం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నంద్యాలలో జరిగిన 53వ అంతర్ జిల్లాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు మొదటి స్థానం సాధించింది. జిల్లా కోచ్ హరికృష్ణ సారథ్యంలో విశాఖ జిల్లా జట్టు గురువారం జరిగిన ఫైనల్‌లో పశ్చిమగోదావరి జిల్లాపై 7-3 స్కోర్ తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. ఫైనల్‌కు ముందు అనంతపురం, బాపట్ల, నంద్యాల, కర్నూలు జిల్లా జట్లపై గెలుపొందినట్లు జిల్లా కార్యదర్శి ఎస్.రాజారావు తెలిపారు. జట్టు సభ్యులను కార్యనిర్వాహక కార్యదర్శి పూసపాటి సత్యనారాయణరావు అభినందించారు.



ప్రథమస్థానంలో నిలిచిన విశాఖ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

దుర్గమ్మా.. కరుణించమ్మా...



చినగదిలి సాయిబాబా గుడి కూడలిలో దుర్గామాతగా అమ్మవారు



తోటగరువు ఎర్ని దుర్గమాంబ ఆలయంలో..



అమ్మవారి రూపాల్లో చిన్నారులు



దుర్గాదేవిగా దర్శనం

సత్యసాయిలో దసరా ఉత్సవాలు




ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : సత్యసాయి సేవాసంస్థల ప్రేమసదన్‌లో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దుర్గాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపారు.



దుర్గాదేవిగా పార్వతీదేవి అలంకరణ

ఎంవీపీకాలనీలోని కిడ్స్ గార్డెన్స్ పబ్లిక్ స్కూలులో దసరా సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. దుర్గాదేవి, సరస్వతీదేవి, కాళికాదేవి తదితర దేవతల వస్త్రాలంకరణలో చిన్నారులు అలరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సాయిలక్ష్మీ పర్యవేక్షిస్తూ దసరా విశిష్టతను వివరించారు.

– న్యూస్‌టుడే, ఎం.వి.పి. కాలనీ, విశాలాక్షినగర్, పెదవాల్తేరు, ఆరిలోవ



ఆదర్శనగర్‌లో...



ఎంవీపీ సెక్టారు-5 నివాసుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు



పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



చినవాల్తేరు ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీమణి కింజరాపు మాధవి



పాతడెయిరీ ఫారం కూడలిలో..



అన్న సమారాధన

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం 22వ వార్డు పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఆశయాలు కొనసాగిద్దాం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు తెదేపా నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్ కార్యాలయం వద్ద రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. టాటా ఆశయాలను కొనసాగించాలని కోరారు. తెదేపా నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, నెక్కంటి సత్తిబాబు, రాజు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



టాటాకు నివాళులు అర్పిస్తున్న పట్టాభిరామ్ తదితరులు

ఆశ్రయ నిర్వాహకులకు అండగా ఉంటాం

కార్పొరేషన్: నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న జీవీఎంసీ ఆశ్రయ నిర్వాహకులకు నగర పోలీసులు అండగా ఉంటారని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆశ్రయ నిర్వాహకులు సీపీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు.

తీరంలో అపరిశుభ్రత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదజాలారిపేట తీరంలో వ్యర్థాల పోగులు సందర్శకులను అసహనానికి గురిచేస్తున్నాయి. వినాయక నిమజ్జనాలు జరిగాక విగ్రహాలు తయారు చేసే గడ్డి, కర్రలు తీరానికి కొట్టుకు వచ్చి పోగులుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి తీరం శుభ్రం చేయాలని పలువురు పర్యాటకులు కోరారు.



తీరంలో చెత్త పోగులు

రేషను డిపోల పునర్విభజనపై అభ్యంతరాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషను డిపోల పునర్విభజన పట్ల డీలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకరికి ఒక విధంగా, మరొకరికి మరోలా కార్డులను కేటాయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 1200కు పైబడి రేషను కార్డులున్న డిపోలను రెండుగా విడదీసి 600 చొప్పున కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై డీలర్లు హైకోర్టును ఆశ్రయించగా.. 1200 కార్డులు పైబడి ఉన్న డీలర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి ముందుకెళ్లాలని సూచించింది. ★ దీంతో గత రెండు మూడు రోజుల నుంచి డీలర్ల నుంచి డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, ఇతర అధికారులు కలెక్టరేట్‌లో డీసీఎస్‌ఓ కార్యాలయంలో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. గురువారం మధురవాడ ప్రాంతానికి చెందిన డీలర్లు తరలి వచ్చారు. తమ సమస్యలను, డిమాండ్లను రాతపూర్వకంగా అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. 600 కార్డులతో డిపోలు నడపడం క్లిష్టమని.. తమ వేదనను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్యయన యాత్రలతో ప్రజాధనం వృథా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు వీధి దీపాల సౌకర్యాన్ని కల్పించలేకపోతున్న జీవీఎంసీ పాలకవర్గం అధ్యయన యాత్రల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తుందని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. 20 నుంచి 27 వరకు వివిధ మున్సిపాలిటీల్లో పర్యటించి, అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకునేలా చేపడుతున్న అధ్యయన యాత్ర వల్ల ప్రయోజనం ఏమిటో తెలియజేయాలని ఆయన కోరారు. యాత్రకు వెళ్లడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తన వాటా నిధులను వార్డులో వీధి దీపాల మరమ్మతులకు వినియోగించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ★ గత యాత్రలతో ఏం సాధించారు? ఇప్పటి వరకు జీవీఎంసీ పాలకవర్గం రెండు అధ్యయన యాత్రలకు వెళ్లిందని, వాటి వల్ల ఏం సాధించారో తెలియజేయాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పర్యటనను సీపీఎం వ్యతిరేకిస్తుందని, మిగతా పార్టీలు వ్యతిరేకించాలని ఆయన కోరారు. గతంలో వైకాపా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే, ప్రస్తుతం తెదేపా అదే బాటలో నడుస్తుందని పేర్కొన్నారు. కేవలం విహారం కోసమే కార్పొరేటర్లను తీసుకెళుతున్నారు తప్ప, నగరానికి ఎలాంటి ఉపయోగంలేదని ఆయన పేర్కొన్నారు.



చిరుధాన్యాలతో టాటాకు నివాళులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి చెందారన్న వార్త అందరిని విషాదంలో నింపింది. ఈ సందర్భంగా విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలతో రతన్‌టాటా చిత్రాన్ని చిత్రీకరించి ఆయనకు ఈ విధంగా నివాళులు అర్పించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడి సన్నిధిలో గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేద మంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్మశానంలో తుప్పల తొలగింపు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఎదురుగా ఉన్న శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయి ఉండటంతో వీటిని తొలగించమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో పొక్లెయినర్ సాయంతో గురువారం వీటిని తొలగించారు.



యంత్రాలతో శ్మశానంలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం



మణిపురి నృత్యప్రదర్శనలో కళాకారులు

మాడవీధుల్లో నృత్య అభినయం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాడవీధుల్లో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు డైరెక్టర్ కె.సునీత నేతృత్వంలో పలువురు నృత్య కళాకారులు నృత్య అభినయంతో ఆకట్టుకున్నారు. మణిపురి, ఇతరత్రా సంప్రదాయ నృత్యాలతో కళాకారులు అలరించారు. తమకు ఈ అవకాశం ఇచ్చిన తి.తి.దే.కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



శ్రీకృష్ణుడి వేషధారణలో..

పరీక్షల నిర్వహణపై వర్చువల్ సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులతో ఏయూ అధికారులు పరీక్షల నిర్వహణపై వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.శశిభూషణరావు, ఇ.ఎన్.ధనుంజయరావు

16.7 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్: విశాఖ మీదుగా విజయవాడకు గంజాయి అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి 16.7 కిలోల గంజాయి సీజ్ చేశారు. నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

విశాఖ ఉత్తరం
•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

రేషను డిపోల పునర్విభజనపై అభ్యంతరాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషను డిపోల పునర్విభజన పట్ల డీలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకరికి ఒక విధంగా, మరొకరికి మరోలా కార్డులను కేటాయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 1200కు పైబడి రేషను కార్డులున్న డిపోలను రెండుగా విడదీసి 600 చొప్పున కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై డీలర్లు హైకోర్టును ఆశ్రయించగా.. 1200 కార్డులు పైబడి ఉన్న డీలర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి ముందుకెళ్లాలని సూచించింది.

★ దీంతో గత రెండు మూడు రోజుల నుంచి డీలర్ల నుంచి డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, ఇతర అధికారులు కలెక్టరేట్‌లో డీసీఎస్‌ఓ కార్యాలయంలో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. గురువారం మధురవాడ ప్రాంతానికి చెందిన డీలర్లు తరలి వచ్చారు. తమ సమస్యలను, డిమాండ్లను రాతపూర్వకంగా అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. 600 కార్డులతో డిపోలు నడపడం క్లిష్టమని.. తమ వేదనను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

12న రావణ వధ

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే : నగరంలోని గంభీరంలో హరేకృష్ణ వైకుంఠంలో ఈనెల 12వ తేదీన ప్రత్యేక బాణసంచాతో కూడిన 20 అడుగుల రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్రీ శ్యామ్‌మాధవదాస పేర్కొన్నారు. నగరంలో మొట్ట మొదటిసారిగా విజయ దశమి ఉత్సవాల్లో ప్రత్యేక పేలుడు బాణాసంచాతో తయారు చేసిన రావణుడి బొమ్మను రూపొందించినట్లు చెప్పారు.

అధ్యయన యాత్రలతో ప్రజాధనం వృథా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు వీధి దీపాల సౌకర్యాన్ని కల్పించలేకపోతున్న జీవీఎంసీ పాలకవర్గం అధ్యయన యాత్రల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తుందని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. 20 నుంచి 27 వరకు వివిధ మున్సిపాలిటీల్లో పర్యటించి, అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకునేలా చేపడుతున్న అధ్యయన యాత్ర వల్ల ప్రయోజనం ఏమిటో తెలియజేయాలని ఆయన కోరారు.

★ గత యాత్రలతో ఏం సాధించారు? ఇప్పటి వరకు జీవీఎంసీ పాలకవర్గం రెండు అధ్యయన యాత్రలకు వెళ్లిందని, వాటి వల్ల ఏం సాధించారో తెలియజేయాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పర్యటనను సీపీఎం వ్యతిరేకిస్తుందని, మిగతా పార్టీలు వ్యతిరేకించాలని ఆయన కోరారు. గతంలో వైకాపా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే, ప్రస్తుతం తెదేపా అదే బాటలో నడుస్తుందని పేర్కొన్నారు.

గెడ్డపై అనధికార నిర్మాణం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 44వ వార్డు పరిధి మాదేటిగార్డెన్స్ సుజాత ఫంక్షన్ హాలు పక్కన ఓ యజమాని గెడ్డపై 20 అడుగుల వంతెన అక్రమంగా నిర్మించాడు. దీనికి జీవీఎంసీ నుంచి కానీ, సచివాలయ ఉద్యోగుల నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదు. ఆ వంతెనపై ఎవరూ రాకపోకలు సాగించకుండా ఉండేందుకు తన ద్విచక్ర వాహనాలు, కారు అడ్డుగా నిలుపుతున్నాడు. దీంతో అక్కడి నివాసితులు కొంత మంది స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు, రాష్ట్ర బి.సి. సెల్ ఉపాధ్యక్షులు కొయిలాడ వెంకటేష్‌ను కలసి సమస్యను తెలిపారు. ఆయన జోన్-5 టి.పి.ఒ. విజయ్‌కుమార్‌కు అక్కడున్న సమస్యను తెలియజేసే విధంగా వాట్సాప్‌లో ఫొటోలు పెట్టి ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేయగా ఆయన స్పందించడంలేదని తెలిపారు. శుక్రవారం ఈ సమస్యపై జోనల్ కమిషనర్‌ను స్వయంగా కలసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలియజేశారు. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత సచివాలయం టౌన్ ప్లానింగు కార్యదర్శి స్వప్న, టి.పి.ఒ. విజయ్‌కుమార్‌కు ఫోన్లో సంప్రదించగా ఏ ఒక్కరూ స్పందించ లేదు.


గెడ్డపై నిర్మించిన వంతెన

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సేవలు భేష్

సీతంపేట, న్యూస్‌టుడే : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రజలకు మంచి సేవలు అందిస్తోందని డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలకు నేత్ర సంబంధిత వ్యాధుల నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఛైర్మన్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ నవీన్ కుమార్, నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు

రతన్ టాటాకు ఘన నివాళి


రతన్‌టాటా చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పిస్తున్న హేమంత్‌కుమార్ తదితరులు

సీతంపేట, న్యూస్‌టుడే : పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో 25వ వార్డు పరిధిలోని శాంతిపురంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ భావితరాలకు రతన్ టాటా జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఆయన చరిత్రను పాఠ్యాంశంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ఆయన సేవా నిరతి దేశ ప్రజలు మరువలేనిది తెలిపారు. కార్యక్రమంలో వాసిపల్లి రాంబాబు, ఉమ్మడి మహేష్, సలపల తిరుపతిరావు, మూర్తి శ్రీనివాస్ నిరుద్యోగ యువత పాల్గొన్నారు.


సీతన్న గార్డెన్స్‌లో అన్నదానం

మాధవధార, న్యూస్‌టుడే: సీతన్న గార్డెన్స్‌లో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవారిని కనకదుర్గా దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెదేపా ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, డాక్టర్ పి. వెంకటరమణ, వెస్ట్ ఏసీపీ ఏ.నరసింహమూర్తి, ఎయిర్‌పోర్టు స్టేషన్ సీఐ ఉమాకాంత్ రావు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి పర్యవేక్షించారు.


వడ్డిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కమిటీ సభ్యులు

యువత అభ్యుదయ సాహిత్యం అధ్యయనం చేయాలి

సీతంపేట, న్యూస్‌టుడే : జనసాహితి ఆధ్వర్యంలో 'మేల్కొన్న ఆసియా', 'స్టాలిన్ గ్రాడ్' పుస్తకాల ఆవిష్కరణ సభ విశాఖ పౌరగ్రంథాలయంలో జనసాహితి జిల్లా అధ్యక్షులు ఎ.శివాజీరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త పి.జయశీలరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువత అభ్యుదయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పుస్తకాలను ఆవిష్కరించారు. ఇలాంటి రచనలు మరిన్ని రావాలన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.ఒ. రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్, సాహితీవేత్తలు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, కె.గౌరీశంకర్, అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జయశీలరావు తదితరులు

రైతుబజారును సందర్శించిన సంయుక్త కలెక్టర్

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార రైతుబజారును గురువారం ఉదయం సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు. రాయితీ టమాటా, నూనె కౌంటర్ల అమ్మకాలను స్వయంగా పరిశీలించారు. బజార్ ఆవరణంతా పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా అమ్మకాలు జరగాలని ఆదేశించారు. డీఎస్‌ఓ భాస్కరరావు, డీఎటీఎంఓ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.


రాయితీ నూనె కౌంటర్లను పరిశీలిస్తు న్న సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్

ఆశ్రయ నిర్వాహకులకు అండగా ఉంటాం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న జీవీఎంసీ ఆశ్రయ నిర్వాహకులకు నగర పోలీసులు అండగా ఉంటారని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆశ్రయ నిర్వాహకులు సీపీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఆశ్రయ నిర్వాహకుడు ప్రగడ వాసు తెలియజేశారు.



ఆశ్రయ నిర్వాహకులతో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

మత్స్యకార మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

వన్‌టౌన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 30వ వార్డు పరిధిలోని జెల్లా వినాయకుని ఆలయ సమీపంలోని జాలారిపేటలో మత్స్యకార మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్ హాజరైన అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఇందిరానగర్-3లో అన్నదానంలో భక్తులు

శ్రీదుర్గాదేవి ఫ్రెండ్స్ గ్రూపు ఆధ్వర్యంలో..

కంచరపాలెం, న్యూస్‌టుడే: శ్రీదుర్గాదేవి నవరాత్రుల్లో ఇందిరానగర్-3లో గురువారం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీదుర్గాదేవి ఫ్రెండ్స్ గ్రూపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరానగర్-1, 3 గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్

అమ్మవారి దర్శనాలకు పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.50 గంటల వరకు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గురువారం అమ్మవారి ప్రీతికరమైన వారం కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు మెయిన్‌రోడ్డును తాకాయి. భక్తులు అమ్మవారి దర్శనం కోసం రెండు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. సాయంత్రానికి తగ్గింది. అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వడంతో పాటు భారీగా గాజులను అలంకరించడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు.


పూజల్లో పాల్గొన్న ఈఓ శోభారాణి, ఏఈఓ తిరుమలేశ్వరరావు తదితరులు

మిధున్ చక్రవర్తికి వి.ఎఫ్.ఎస్.అభినందనలు

సీతంపేట, న్యూస్‌టుడే : ప్రముఖ బాలీవుడ్ నటులు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన మిధున్ చక్రవర్తికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ(వి.ఎఫ్.ఎస్) అభినందన సభ నిర్వహించింది. విశాఖ పౌరగ్రంథాలయంలో సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, కాశీ విశ్వేశ్వరరావు, ఉషారాణి, హుస్సేన్, చాట్ల బాబూరావు, ఇమంది ఈశ్వరరావు, ప్రభుదాస్, సత్యవతి పాల్గొన్నారు.



కేక్ కోస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

ఎన్‌డీఏ పాలనలో గోసంరక్షణ పేరుతో దాడులు

అల్లిపురం, న్యూస్‌టుడే : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనలో గోసంరక్షణ పేరుతో మైనార్టీలు, దళితులు, గిరిజనులపై భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణుల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అల్లిపురం దరి సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు వాహనాలు సమకూర్చుకొని అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ దాడులు ముమ్మరం చెయ్యమని ఉసిగొల్పుతున్నారన్నారు. రైల్వే స్టేషన్లు ఆధునికీకరించి ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. ఉక్కును ప్రయివేటుపరం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి, సత్యనారాయణ, జీఎస్.జె. అచ్యుతరావు, కె.సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిత్యం నిర్వహించే అన్నదాన పథకానికి నగరానికి చెందిన కనకరాజు, షణ్ముఖరావు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. గురువారం సంబంధిత చెక్కును కనకరాజు ఆలయ ఆవరణలో ఏఈఓ తిరుమలేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను ఆలయ అధికారులు దాతకు అందజేశారు.


ఏఈఓ తిరుమలేశ్వరరావుకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత కనకరాజు

వైభవుని ఆలయంలో దసరా త్రిరాత్రి మహోత్సవాలు


అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పరాడ వైభవ వెంకటేశ్వరుని దివ్యక్షేత్రంలో త్రిరాత్రి పూజా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం జరిగిన ప్రత్యేక పూజల్లో అశేషంగా మహిళలు హాజరయ్యారు. మహార్నవమి సందర్భంగా శుక్రవారం కలశంలో సరస్వతీదేవి ఆరాధన, పద్మావతి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు.



గురుద్వారా : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ దరి సాయిబాబా మందిరంలో స్వామిని బద్రినారాయణునిగా, అమ్మవారిని దుర్గాపరమేశ్వరిగా అలంకరించిన దృశ్యాలు


కంచరపాలెం : రెడ్డికంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్ వద్ద గల ఆలయంలో శ్రీదుర్గాభవానీగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు


కార్పొరేషన్ : డాబా గార్డెన్స్ సమీపంలోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించిన దృశ్యం


పూర్ణమార్కెట్ : దుర్గమ్మ అలంకారంలో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు


సీతంపేట : మధురానగర్‌లో శరన్నవరాత్రులు సందర్భంగా కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


సీతంపేటలో రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు తదితరులు


మురళీనగర్ : సెక్టర్-8 వైశాఖిస్పోర్ట్స్‌పార్కు స్కేటింగ్‌రింక్‌లో గురువారం షైనింగ్ స్టార్స్ డ్యాన్స్ అకాడమీ, వైశాఖిస్పోర్ట్స్‌పార్కు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మార్వాడీ గర్బా నృత్యగాన కార్యక్రమంలో మహిళలు

నేడు శాంతిధామంలో దుర్గా పూజ

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-7 శాంతిధామంలో మహార్నవమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 6 వరకు మహాదుర్గకి ప్రత్యేక హారతులు ఉంటాయని ఇన్‌ఛార్జ్ బి.కె.అపరంజి తెలిపారు.

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం సంతోషిమాత గుడి ప్రాంతంలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గాదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవికి ప్రత్యేక అర్చన

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక సీతారామాలయంలో కొలువై ఉన్న లలితాదేవి గురువారం శ్రీ దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం జరిగిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ ప్రాంగణంలో తిరు ప్రదక్షిణ చేసి ప్రత్యేక హారతులు ఇచ్చారు.


దుర్గాదేవి అవతారంలో లలితాదేవి, కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: గణేష్‌నగర్‌లో శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం, గణేష్‌నగర్ సేవా కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైనవారిని ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, ఎం.రంగారావు, టి.వెంకటరావు, మాదేటి సత్యనారాయణ, శెట్టి లక్ష్మణరావు, పైలా రమణ తదితరులు పాల్గొన్నారు.


దుర్గాదేవి మండపంలో నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వాసుపల్లి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైకాపా బాధ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల గురించి చర్చించినట్లు చెప్పారు.

16.7 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ మీదుగా విజయవాడకు గంజాయి అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన వ్యక్తిని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన జగదీష్ నాయక్ విశాఖ రైలు నిలయంలో రైలు కోసం ఎదురు చూస్తుండగా గస్తీ బృందానికి చిక్కాడు. అతడి బ్యాగ్‌లను తనిఖీ చేయగా గంజాయి పొట్లాలున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి 16.7 కిలోల గంజాయి సీజ్ చేశారు. నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.


రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

వృద్ధులకు వైద్య పరీక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్నేహసంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు, ఆశ్రమవాసులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. చక్కరవ్యాధి నిర్ధరణ పరీక్షలతో పాటు బీపీ పరిశీలించి అవసరమైన వారికి ఔషధాలను అందజేశారు. సంస్థ వైద్యురాలు డాక్టర్ అనసూయ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. శారీరక వ్యాయామం, క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పుండరీకాక్ష ప్రసాద్‌నాయుడు, కమలప్రియ, మౌనిక, కిరణ్ పాల్గొన్నారు.


మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనసూయ ←

అనాథాశ్రమానికి ప్రవాసాంధ్రుని వితరణ



చిన్నారులతో సుధీర్‌రెడ్డి

మురళీనగర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారి సమీపంలో ఉన్న జనరేషన్ యువ చిన్నారుల ఆశ్రమానికి అమెరికాకు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ అర్కాన్సిస్ (తా) భారతీయ ప్రతినిధి గుండేశి సుధీర్‌రెడ్డి మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ప్రతినెలా తమ సంఘం ఆధ్వర్యంలో ఈ తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కూర్మారావు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో పతకాలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) తైక్వాండో పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు పతకాలు గెలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దేముడుబాబు తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగాల్లో వెంకట ధనుష్, వై.జ్యోత్స్న, బి.క్రిష్ణచైతన్య, మోహిత్, పి.జస్వికా, అంజనిప్రియ, సుస్మిత, టి.మణికంఠ హిమాన్షు స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా బి.అమృతవర్షిణి, బి.లావణ్య, కె.ఉదయ్‌నిఖిల్, కె.ఆదిత్య, టి.శ్రీకర రోహిత్‌కుమార్, కె.ధనలక్ష్మి రజత పతకాలు, వి.యువరాజ్, ఎస్.గోవర్ధని, లావణ్య, ఫా తిమాముస్నీస్, ఎం.గాయత్రి కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు.


పతకాలు గెలుపొందిన క్రీడాకారులు

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం



ఫుట్‌బాల్ ఆడుతున్న నేవీ సిబ్బంది

నేవీ స్నేహపూర్వక క్రీడలు

సింధియా, న్యూస్‌టుడే : విశాఖ తీరంలో జరుగుతున్న మలబార్-2024 విన్యాసాల్లో భాగంగా గురువారం భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాల సిబ్బంది మధ్య స్నేహపూర్వక క్రీడలు జరిగాయని నేవీ వర్గాలు తెలిపాయి. సాంస్కృతిక అంశాల్లో పరస్పర సంబంధాల మెరుగునకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నాయి.

సందడిగా దసరా ఉత్సవాలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-8),న్యూస్‌టుడే : ఉక్కునగరం కాలీబరీ కాంప్లెక్స్‌లో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి సాగరిక బాగ్చీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరించారు. ఏటా మాదిరిగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో కలీబరీ అధ్యక్షులు పీఎస్.ఘోష్, కార్యదర్శి అభయంకర్ బెనర్జీ, సభ్యులు చక్రవర్తి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం

సమస్య : ఎన్ఏడీకూడలి పైవంతెన సమీపంలో అనధికార దుకాణాల ఏర్పాటుతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -శ్రీనివాసరావు, శాంతినగర్

సమాధానం: పరిశీలించి.. ఆయా దుకాణాలు తొలగిస్తాం.
– మూర్తి, 52వ వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

?: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు.
-మంగలక్ష్మి, గవరవీధి

✔: సిబ్బందిని పంపి, పరిశుభ్రత పనులు చేయిస్తాం. -బుచ్చిబాబు, 90వ వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

తీగ తగిలితే.. షాకే..!

విద్యుత్తు నియంత్రికల వద్ద కానరాని రక్షణ చర్యలు



క్రాంతినగర్‌లో..



62వ వార్డు దుర్గానగర్‌లో..



63వ వార్డు డబుల్ ట్యాంకు కూడలిలో..



త్రినాథపురం సీఐఎస్ఎఫ్ రోడ్డులో..

పారిశ్రామిక ప్రాంతం 62, 63 వార్డుల పరిధిలోని రహదారులు, కూడళ్లలో ఉన్న విద్యుత్తు నియంత్రికల వద్ద సరైన రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యాలయాలు, దేవాలయాలు, మార్కెట్ల సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రికల వద్ద తీగలు చేతికి అందే ఎత్తులోనే ఉంటున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మల్కాపురం

మురుగు... ముందుకెళ్లేదెలా..?

పారిశ్రామిక ప్రాంతం హెచ్‌పీసీఎల్ -రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు కోసం తవ్విన గెడ్డలో, దువ్వాడ నాలుగో ప్లాట్‌ఫామ్ వైపు రోడ్డు విస్తరణకు తవ్విన గోతుల్లో వర్షం నీరు చేరి మురికికూపాల్లా మారాయి. చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసనతో పాటు, దోమల బెడద ఎక్కువైంది. దీంతో హెచ్‌పీసీఎల్ ప్రాజెక్టు వద్ద కార్మికులు, దువ్వాడ స్టేషన్ వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నిర్వాహకులు స్పందించి.. ఆయా చోట్ల శుభ్రత పనులు చేయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, సింధియా, ఉక్కునగరం(కూర్మన్నపాలెం)



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద..



దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫామ్ వైపు..



విశాఖ రిఫైనరీ ప్రాజెక్టు సమీప గెడ్డలో..

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

గాజువాక: నక్కపల్లి ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి మౌళి మణివర్మ గురువారం బీసీరోడ్డులో ఆటో ఎక్కి పాతగాజువాక కూడలిలో దిగాడు. ఆ సమయంలో తన ల్యాప్‌టాప్ బ్యాగు ఆటోలో మరిచిపోయి హడావుడిగా బస్సు ఎక్కేశాడు. కాసేపటికి బ్యాగు లేదని గుర్తించి, వెంటనే డయల్ 100కు ఫోన్ చేశాడు. గాజువాక క్రైం కానిస్టేబుల్ సీతారామ్ పాతగాజువాక కూడలిలో సీసీ కెమెరాల దృశ్యాలు పరిశీలించి బ్యాగును గుర్తించారు. గాజువాక క్రైం సీఐ శ్రీనివాసరావు సమక్షంలో బాధితుడికి బ్యాగు అందించారు.

అధ్యయన యాత్రలతో ప్రజాధనం వృథా

కార్పొరేషన్: నగరంలో ప్రజలకు వీధి దీపాల సౌకర్యాన్ని కల్పించలేకపోతున్న జీవీఎంసీ పాలకవర్గం అధ్యయన యాత్రల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తుందని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. కార్పొరేటర్ల అధ్యయన యాత్ర వల్ల ప్రయోజనం ఏమిటో తెలియజేయాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం..

● **శిర్డీసాయి ఆరాధనోత్సవం**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ సమతానగర్‌లో కొలువైన శిర్డీ సాయినాథుని మందిరంలో గురువారం ఆరాధనోత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కె.సత్యంబాబు పర్యవేక్షణలో భక్తులు పూజలు చేశారు. 12న బాబాకు పుష్పార్చన, విశేష పూజలు ఉంటాయని ఆయన తెలిపారు.

● **చోరీ కేసులో నిందితుల అరెస్టు**

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ఎలక్ట్రికల్ సంస్థలో ఈ నెల 4న జరిగిన చోరీలో పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు నేర విభాగం ఏసీపీ వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుర్రమ్మపాలెంలోని జీకే ఎలక్ట్రికల్స్ సంస్థలో సుమారు రూ.12 లక్షలు విలువ చేసే 880 కిలోల రాగి తీగలను ఈ నెల 4న అర్ధరాత్రి దుండగులు దోపిడీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు పెందుర్తి నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సింహాచలంపాలెం దినపువాడ కాలనీ, గాజువాక ప్రాంతాలకు చెందిన చిత్తు కాగితాలు ఏరుకునే పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

● **పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి**

సింధియా, న్యూస్‌టుడే : పింఛనుదారుల సమస్యల్ని పరిష్కరించేలా ఆయా సంస్థల యాజమాన్యాలకు ఈపీఎఫ్ అధికారులు నోటీసులను జారీ చేయాలని పోర్టు పారిశ్రామిక ప్రాంత ఆల్ పెన్షనర్స్ సంఘం నాయకుడు ఎస్.సాహెబ్ తమ్మారావు డిమాండ్ చేశారు. గురువారం 61వ వార్డు వెంకన్నపాలెం సిటూ కార్యాలయంలో జరిగిన పింఛనుదారుల సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. సభ్యులు హుస్సేన్, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి పన్ను మేళా'కు స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, న్యూస్‌టుడే: ప్రజల క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం కూడలిలో గురువారం జీవీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఇంటి పన్ను మేళా'లో ఆయన పాల్గొని మాట్లాడారు. పన్నుల చెల్లింపు, పన్నుల విధింపులో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న మేళాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మేళాలో ప్రజలకు సేవలు అందించారు. జోన్-5 జెడ్సీ రాము, 63వ వార్డు కార్పొరేటర్ చిన్నా, తెదేపా నాయకులు తోట రత్నం, మాలినాయుడు, రమణ, చంద్రశేఖర్, రాజు, సన్యాసిరావు, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి : సిటూ

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : కర్మాగారంలోని పలు విభాగాల్లో రెండు నెలలుగా ఎలాంటి టెండర్లు పిలవకపోవడంతో సుమారు 600 ఒప్పంద కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని సిటూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉక్కునగరం స్మృత్యంజలి పార్కు వద్ద ఒప్పంద కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకే టెండర్లు పిలవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి... సమస్యను పరిష్కరించాలని కోరారు.



ధర్నా చేస్తున్న సిటూ సభ్యులు

నార సంచుల వినియోగమే మేలు



సంచులు పంపిణీ చేస్తున్న మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలంతా సహకరించాలని జీవీఎంసీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం గోపాలపట్నం రైతుబజార్‌లో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారసంచులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ నార, వస్త్ర సంచుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై ప్రచారం చేయాలని సంస్థ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో బజార్ ఎస్టేట్ అధికారి నారాయణరావు, సిబ్బంది శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వినాయకనగర్‌లో..



ఎల్‌వీనగర్‌లో..



రాజీవ్‌నగర్‌లో..



కైలాస్‌నగర్‌లో..



అగనంపూడిలో..



త్రిశక్తి ఆలయంలో..



సాగరగిరిపై..



ఎల్లపువానిపాలెంలో..



బాపూజీనగర్‌లో..



శాతవాహననగర్‌లో..

ఎన్నో రూపాలు నీవి... మా కన్నుల్లో కొలువైన దేవి..!



వుడాకాలనీలో కుంకుమార్చన



నాతయ్యపాలెంలో...

న్యూస్‌టుడే, గాజువాక, విశాఖ పశ్చిమం బృందం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గాజువాక, పశ్చిమం నియోజకవర్గాల్లో కనకదుర్గ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఎల్‌వీనగర్‌లో కాళికామాత, వాంబేకాలనీలో వరలక్ష్మిగా అలంకరించారు. నాయకులు దేవన్‌రెడ్డి, ఇమ్రాన్ తదితరులు పూజలు చేశారు. ● జీవీఎంసీ 86వ వార్డు శాతవాహననగర్‌లో కుంచమాంబ అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వార్డు పరిధి రాసాలమ్మకాలనీలో అన్నసమారాధనను సూర్యనారాయణ ప్రారంభించారు.
● జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గణేష్

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

యూత్ (వెల్ఫేర్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపంలో అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు, సేవ విద్యాసాగర్, జోనల్-5 జెడ్సీ బి.రాము, వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు దర్శించుకున్నారు. ● జీవీఎంసీ 52వ వార్డు కరాస ఇజ్జ యాజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. నాయకులు వాసుదేవరావు, మోహన్, వై.తిరుమల రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. 89వ వార్డు కొత్తపాలెంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వార్డు వైకాపా అధ్యక్షుడు ఎ.గోపి ప్రారంభించారు. ● అక్కిరెడ్డిపాలెంలో కార్పొరేటర్ ఆహాత్య పూజలు చేసి, అన్నసమారాధనను ప్రారంభించారు. నాతయ్యపాలెంలో అమ్మవారి సారె ఊరేగించి, నైవేద్యం సమర్పించారు.



కరాసలో భక్తుల పూజలు



ఉక్కునగరంలో...



కొత్తపాలెంలో అన్నసమారాధన



వాంబేకాలనీలో..

బ్రహ్మోత్సవంలో కోలాటం



తిరుమలలో మహిళల ప్రదర్శన

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక సంపత్ వినాయకనగర్‌కు చెందిన కోలాట బృందం గురువారం తిరుమల బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనతో అలరించింది. శ్రీ వెంకట సీతారామ మహిళా భక్త మండలి సభ్యులు హనుమంతుడి సేవ ఎదుట కోలాటాన్ని ప్రదర్శించారు. సంస్థ ప్రతినిధి కె.సుజాత సారథ్యంలో 20 మంది సభ్యుల నర్తించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఎస్ఎల్‌పీ.రావు సహాయ సహకారాలు అందించారు.

ఉక్కులో బతుకమ్మ సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు సీజీఎం(వర్క్స్) యు.శ్రీధర్, తదితరులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-5), న్యూస్‌టుడే : ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సీ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయి. కార్యక్రమాన్ని ఉక్కు సీజీఎం (వర్క్స్) ఇన్‌ఛార్జి యు.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జీఎంలు రవిశేఖర్, నవీన్‌కుమార్, ఎన్.వీరేశం, ఎన్.కుమారస్వామి, మోహన్‌రావు, జి.ఆనంద్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా రథోత్సవం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం ఐఎన్ఎస్ ఏకశిల వద్ద ఉన్న విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి రథోత్సవం జరిగింది. ముందుగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి, ఆలయ ప్రాంగణ పరిసరాల్లో రథాన్ని ముందుకు లాగారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ పిల్లా శంకరరావు ఆయనకు ప్రత్యేక జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణబాబుకు జ్ఞాపిక అందిస్తున్న పిల్లా శంకరరావు



సిబ్బందికి దుస్తులు అందించిన ప్రతినిధులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ కొత్త కర్నవానిపాలేనికి చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యుడు కులుకూరి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా గురువారం పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్లు, చీరలు, డిజైర్ సొసైటీ అనాథ బాలలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. వాసవీ సేవాదళ్ సభ్యుడు కులుకూరి మంగరాజు, ఇతర ప్రతినిధులు కేసారపు శ్రీను

కార్మికులకు దుస్తుల పంపిణీ

రమేశ్, నంబూరు జగన్నాథరావు, జనపరెడ్డి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం మేనేజర్ ఎ.మమత ఆధ్వర్యంలో పలువురికి దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ... వసతి గృహంలో ఇప్పటి వరకు 168 మంది ఆశ్రయం పొందారన్నారు. 52 మంది మానసిక దివ్యాంగుల్ని వైద్యం నిమిత్తం కేర్ ఆసుపత్రిలో చేర్పించామని, 48 మందిని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

గాజువాక సినిమాలు..

కన్య: **దేవర**, హెవెన్: జనక **అయితే** గనక
శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ, అన్నపూర్ణ: **వేట్టయన్**, మోహినీ 70ఎంఎం: **విశ్వం**
లక్ష్మీకాంత్: **స్వాగ్**, మినీ మోహినీ: **మార్టిన్**
మోహినీ: **జిగ్రా**,
విశేష్: **మా నాన్న సూపర్ హీరో**

గోపాలపట్నంలో: శ్రీనరసింహ: జనక **అయితే** గనక, నరసింహ: **వేట్టయన్**
సౌజన్య: **విశ్వం**, సుకన్య: **దేవర**
మౌర్య: **మా నాన్న.. సూపర్ హీరో**

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: **వేట్టయన్**
స్క్రీన్-3: **విశ్వం**, స్క్రీన్-4: **దేవర**
స్క్రీన్-1: **మార్టిన్**

వేగ నిరోధకాల ఏర్పాటు



పనులు పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్సై విజయ్‌కుమార్

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం పెట్రోల్‌బంకు కూడలి నుంచి సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఎస్సై జి.విజయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలల విద్యార్థులు, పాదచారుల రాకపోకల్ని దృష్టిలో ఉంచుకుని కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం, గోశాలకూడలి, సింహాచలం సమీపంలో వేగ నిరోధకాల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. గురువారం ప్రారంభమైన నిర్మాణ పనుల్ని వారు పరిశీలించారు.

కార్మికుల సేవలు మరువలేనివి



కార్మికుల్ని సత్కరించిన జగన్, తదితరులు

కూర్మన్నపాలెం (వడ్లపూడి), న్యూస్‌టుడే : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టిన పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. గురువారం నిర్వాసిత వడ్లపూడిలో పలువురు కార్మికుల్ని సత్కరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేలా విధులు నిర్వహిస్తున్న కార్మికుల్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కూటమి నాయకులు ఎల్.సోంబాబు, కె.కన్నారావు, పి.దానయ్య, సురేష్, డి.అప్పలనాయుడు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

గాజువాక, న్యూస్‌టుడే : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉన్నప్పుడే జీవన గమ్యం సజావుగా సాగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా గాజువాక పీహెచ్‌సీ వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు సుధాకర్, బద్రీనారాయణమూర్తి, నాగఅప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, పుల్లయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రతికూల భావోద్వేగాలకు దూరంగా ఉంటూ, ఎప్పటికప్పుడు సానుకూల అంశాలపై దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో వైద్యులు, న్యాయవాదులు

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డులో దశల వారీగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. గురువారం సుసర్లకాలనీ నుంచి బాజీకూడలి వరకు సుమారు రూ.14.85 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించే కాలువ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు. ప్రజా పనుల విభాగం ఈఈ రత్నాకర్, ఏఈ వెంకటలక్ష్మి, వార్డు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

'రతన్ టాటా జీవితం ఆదర్శనీయం'



రతన్ టాటాకు నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు

గాజువాక, న్యూస్‌టుడే : వ్యాపార దిగ్గజం రతన్ టాటా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని గాజువాక తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గురువారం గాజువాక పార్టీ కార్యాలయంలో బీసీసెల్ ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులు అర్పించారు. బీసీసెల్ అధ్యక్షుడు తమిరె శివప్రసాద్, నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, జ్యోతికుమార్ పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని అగనంపూడికి చెందిన పలువురు నాయకులు పేర్కొన్నారు. రతన్ టాటా మృతికి గురువారం పలువురు సంతాపం ప్రకటించారు. 79వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ తదితరులు ప్రకటనలు విడుదల చేశారు.